# పర్యవసానం

★

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

'రేపు ఉదయం సాయంకాలం రేడియోలో పాడవలసిఉంది; ఇప్పుడు సినీమాకి వెళ్తే మామూలు నిద్రవేళ దాటిపోతుంది, తరవాత సరిగా నిద్రపట్టకపోవడమూ, రేపు ఉదయానికి గొంతు ఉండవలసినంత చక్కగా ఉండకపోవడమూ ఇవేవీ అంత కోరుకోవలసినవి కావు. కాక తానీరోజు ప్రయాణపు బడలిక మీద ఉన్నాడు; అందుచేత ఇప్పుడు చక్కగా భోంచేసి ఏదో చదువుకొంటూ పడుకోవడం ఉత్తమం; రేపు సాయంకాలం పాట అయిపోయేక ఎలాగూ రాత్రి రెండవ ఆట సినీమా చూడవలసిఉంది' అని మనస్సున బోధ చేసుకుని శంకరశాస్త్రి నాటి సాయంకాలం మొదటిఆటసినీమాకి వెళ్ళే ఉద్దేశాన్ని ఉపసంహరించుకొన్నాడు.

సినీమా చూడకుండా కూడా ఆలస్యమెందుకని ఏడుగంటలకే భోజనం చేసి, రెండు కిళ్లీలు, రెండు దినపత్రికలు (ఒకటి తెలుగుది, ఒకటి ఇంగ్లీషుది) తీసుకొని మేడమీద తన గదిలోకి వెళ్లి కూర్చున్నాడు.

పడక కుర్చీలో కూర్చుని పత్రిక చదివినంతసేపూ బాగానే గడిచిపోయింది కాలం; కొంచెం నిద్రవచ్చేట్లు కూడా అనిపించింది. టైము పదినిమిషాలు తక్కువ ఎనిమిది; మామూలుగా పడుకొనేకంటె ఒక గంట ముందే. 'అయినా ఇవాళ ప్రయాణపు బడలిక పోవాలంటే వేగం నిద్రపోడంకంటె మంచి సాధనం లేదు' అనుకుంటూ కుర్చీలోంచి లేచి, కూజాలోని కాసిని మంచినీళ్లు త్రాగి, తలుపు వేసుకొని, ఎలక్ట్రిక్ లైటు ఆర్పి, ప్రక్కమీద పడుకొన్నాడు, భక్త చింతామణి లోనివి తన అలవాటుగా చదివే రెండు పద్యాలు చదువుకొంటూ.

పద్యాలు పూర్తి అయిపోయేయి; ఒక పదినిమిషాలు అటూ ఇటూ ప్రక్కమీద దొర్లేడు. కాని నిద్రవచ్చే సావకాశం క్రమక్రమంగా తగ్గిపోతున్నదే తప్ప ఎక్కువ కావడంలేదు. ఇప్పుడు ఏమీ అవసరమూ సందర్భమూ లేని ఆలోచన లెందుకిలా వస్తాయో! అయినా ఒక్క తన మనస్సుదే తప్పు కాదు; ఈ గదిలోనే ఉంది సగం పొరపాటు; కుడితట్టుగదిలో ఎవరో వర్తకులు; వాళ్ళ లెక్కలు గొడవలు; ఇద్దరు మాత్రమే ఉండేది; అయినా ఎందరు ఉన్నారో ఏమిటోగాని పదిమంది చేరి గొడవపెట్టినకంటె బాధగా ఉంది. ఎడమతట్టు గదినుండి వచ్చే ధ్వని అంత అధికంగా లేకపోయినా, తన నిద్ర చెడగొట్టడానికి అవతలి వర్తకుల వ్యాపారసరళి కబుర్లకంటె ఎక్కువగానే పనిచేస్తున్నది. ఏవేవో గుసగుసలుగా మాటలు; ఉండుండి నవ్వులు, గాజుల కదలిక—మళ్లీ కొంచెంసేపు విరామం, మళ్లీ ఏవో వినబడని కబుర్లు, నవ్వులు, గాజుల గల గల, ఒకటే గ్రామఫోను రికార్డును మళ్లీ మళ్లీ వేసినట్లుంది.

హుం. మాటలు తిన్నగా వినబడడం కాదు, వినబడకపోడమూ కాదు. శంకరశాస్త్రికి ఒకవంకనుండి మాటలు తప్పించుకోబడనంత స్పష్టంగా వినిపిస్తున్నాయని కోపము; ఇంకొకవంకనుండి గాజుల గలగలతో కలిసివచ్చే మెత్తటి మాటలు స్పష్టంగా వినిపించలేదని కోపము. అసలీ తప్పంతా ఎవరిది? హోటలు మేనేజరుది. ఇదివరకు మూడు నాలుగుమార్లు తనకు మామూలుగా ఇచ్చే, ఆ చివరిగది ఇచ్చిఉంటే. ఈవిధంగా రెండు వంకలనుండి వచ్చిపడే సంభాషణ పరంపరకి తట్టుకోవలసిన అవసరం లేకపోయి ఉండును. కిటికీలోనుండి, ఊరు చాలా దూరంవరకు చక్కగా కనబడుతూ ఉండేది. ఈ గదికి ఉన్నది ఒక్కటే కిటికీ. అదయినా హోటలు లోపలిభాగంవంకకు తెరుచుకొని ఉన్నది. అందులోనుండి హోటలు పనిమనుష్యుల అలికిడి తప్ప మరేమీ కనబడదు; పైగా, ఆగదికంటె రోజుకు అద్దె ఒక అర్ధ రూపాయి ఎక్కువ కూడా! ఏమయినా ఈమారు వచ్చినప్పుడు మరి ఈ హోటలులో బస చేయకూడదు.

సుమారు తొమ్మిది అయిపోతున్నది. ఇంకా తాను నిద్రపోలేదు. ఈ ఇరుప్రక్కలనుండి వచ్చే ధ్వనితరంగాలమూలంగా మరి ఇంత వేగంలో నిద్రవచ్చే సావకాశంకూడా గోచరించడంలేదు.

తాను వేగంగా నిద్రపోవాలనుకొన్నాడుగాని, మామూలు వేళే అయింది. కేవలం స్థలం మారడంవల్లనే కాదు, ఈ గదికి ఉన్న ప్రత్యేకమయిన అసదుపాయాల మూలంగానే తాను నిద్రపోలేకపోతున్నాడు. ముందు ఈ ఇరుప్రక్కల మనుష్యులూ నిద్రపోతేనేగాని, తనకు నిద్రపట్టే యోగ్యత మరి లేనట్టే. కాక, వీళ్ళ వైఖరీ చూస్తే, మరి ఈ రాత్రి నిద్రపోయే ఉద్దేశంలో ఉన్నట్టు కనబడదు. ఇందాకా తను భోంచేస్తున్నప్పుడు రెండు టేబిళ్ళ అవతల కూర్చొని భోంచేస్తున్నారు, వీళ్ళే కాబోలు; అక్కడా ఇంతే. ప్రక్కవాడికయినా వినబడకుండా ఏవో మాటలూ కిలకిల నవ్వులూ. అంతగా తమ మాటలు ఒకరికి వినబడకూడదన్న ఉద్దేశం ఉన్న వాళ్ళకి తమ నవ్వులు ఇతరులకి అనవసరమయిన అసదుపాయాన్ని కలిగిస్తాయేమోనన్న అనుమానమయినా ఉండవద్దా. అసలు వీళ్ళు ఇప్పుడు ఎందుకు నవ్వుతున్నట్టు? ఇటువంటి వాళ్ళను చూసే కాబోలు నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు.

అంతవరకూ తొందరగా వెళ్ళి హఠాత్తుగా స్తంభానికి డీకొన్నట్లుగా ఒక్కమారు నిలబడి ఎదురు తిరిగింది అతనిమనస్సు. తా నీరోజున వేగం నిద్రపోవాలనుకొని, పోలేకపోయినంతలో ఇతరుల నెందు కనుకోవాలి? ఇప్పుడు సరిగా వేళకు ఊళ్ళో లేక పోడం వల్లగాని. తన స్నేహితులు సుబ్రహ్మణ్యమో శర్మోగాని ఉండి ఉంటే తన గదినుండి అన్ని గదులనుండి కంటె ఎక్కువ ధ్వని పుట్టి ఉండును. అప్పుడు వాళ్ళేమనుకొని ఉందురో?

ఇంతకీ తాను అనవసరంగా చికాకుపడ్డాడు గాని, వర్తకులు భోజనానికి వెళ్ళిపోయినట్టున్నారు. ఇవతలి తట్టునుండి వచ్చే అస్పష్టమయిన ధ్వనిమూలంగానే నిద్రపోలేక పోయానంటే, అందుకు బాధ్యత తన మనస్సుదేనని ఒప్పుకోక తప్పదు. అంతే కాక, వాళ్ళు కూడా, ఇవతలివాళ్ళకు ఎక్కడ ఇబ్బందిగా ఉంటుందో అనేకొలోలు అంత నెమ్మదిగా మాట్లాడుకొంటున్నారు. అయినా కొంచెం వినిపిస్తున్నాయంటే అది హోటలు గోడల తప్పు. ఇక మాటలకంటె నవ్వులూ గాజుల గలగలలూ ఎక్కువగా ఉన్నాయంటే మాత్రం కేవలం వాటి మూలంగానే తాను నిద్రపోలేక పోయాననడం సమంజసంగా ఉందా? క్రింద రోడ్డు మీద పరుగెత్తే బహువిధాల వాహనాల కోలాహలమూ, హోటలు పనివాళ్ళ మాటలు, దగ్గరలోని పోలీసు కిల్లీదుకాణాల మీద సోడా బుడ్లు కొద్ది కొద్ది దూరంలో కంయి కుంయుమని కొట్టినప్పుడు, ఇన్నిటితో కలిసి కూడా తన ప్రత్యేకతను చూపుకోడం మానలేని రెండు మేడల అవతలినుండి వచ్చే రేడియోసంగీతమూ— మొదలయిన అనేకధ్వనుల వైర్వరు ప్రభావాలలో జీవితోనూ పోల్చడానికి వీల్లేని చిన్న సవ్వడిమూలంగా తాను నిద్రపోలేకపోయే ననడం నమ్మదగిన మాటకాదు.

అయితే కొన్ని కొన్ని నిజమయిన మాటలు ఏమాత్రమూ నమ్మదగినవిగా ఉండవులే, అనుకొంటూ, మంచంమీదనుండి లేచి, పడక కుర్చీ ఉన్న ఒక్క కిటికీ వద్దకూ లాగి, మంచంమీద తలగడ ఒకటి తీసుకొని కిటికీ అంచుమీద కాళ్ళు పెట్టి, కుర్చీలో వెనక్కు చేరగిలబడి కూర్చున్నాడు. ఈ దృశ్యం బాగానే ఉంది. కిటికీలోనుండి ఆకాశం తప్ప మరేమీ కనబడదు. ఇందాకా తాను నిలబడి క్రిందకు తిరిగి చూడడంవల్ల హోటలుఅంతర్భాగము మాత్రమే కనబడి అసహ్యం కలిగిందిగాని, ఇలా పడుక్కొని చూస్తే ఆకాశపు నీలి చీరమీద తెల్లటి చుక్కలు ఎంతో ఆత్మీయంగా కనిపిస్తున్నాయి. వాటిని చూస్తూ ఉంటే, తను ఊళ్ళో తన గదిలో కూర్చొని ఆకాశంవంక చూస్తున్నట్టే భావించుకోవచ్చును. ఇంటిదగ్గర అన్నయ్య ఇప్పుడిప్పుడే ప్రైవేటు ట్యూషన్ల కుఱ్ఱవాళ్ళను పంపించి పడుక్కొని ఉంటాడు. వదినకి మాత్రం అంత ఓపిక ఎక్కడనుండి వస్తుందో, పగలంతా ఇంటిపని చేసినా, రాత్రి మాత్రం పదిగంటలవరకూ ఏదో చదువుతూనే ఉంటుంది.

మళ్ళీ ప్రక్క గదిలోనుండి నవ్వులు వినబడ్డంతో అతనికొక కొత్త ఆలోచన పుట్టింది. వీళ్ళెవరూ? భార్యాభర్తలనే ఊహించక తప్పదు. అయితే మాత్రం అంతగా ఏకాంతాలు చెప్పుకొని అస్తమానం నవ్వుకోవలసిన అవసరం ఎలా కలుగుతుందో? అన్నయ్యా, వదినా ఇద్దరూ వ్యక్తిగతంగా సరదా అయిన మనుష్యులే, అయినా తమలో తాము అధికంగా మాట్లాడుకోరు. మాట్లాడినప్పుడయినా ఏవో సాంసారికపు ఖర్చు వెచ్చాల గురించీ లేక మరేవో వాద ప్రతివాదాలలో తప్ప ఇద్దరూ కలిసి ఐకమత్యంగా ఉన్నట్టు కనిపించరు. మొట్టమొదట చూసిన వాళ్ళకి. అయితే ఇద్దరికీ ఒకరిని విడిచి ఒకరు ఒకరోజయినా ఉండలేనంతటి అభిమానం. అప్పుడు పిల్లల వేసవిశెలవులు రెండు నెలలు ఆవిడను పుట్టింట్లోనే ఉండనియ్యాలనుకొన్న అన్నయ్య పదిరోజుల్లో బెంగపెట్టుకొని, జ్వరం తెచ్చేసుకొన్నాడు; ఆవిడ వచ్చీ రావడంతోనే ఆ జ్వరమూ పోయింది. ఇక ఆవిడ ఎప్పుడూ వాడు ఇంట్లో ఉన్న సంగతే అక్కర్లేనట్టుంటుంది. కాని, వాడొక నాలుగు రోజులుపై ఊరికి వెళ్ళేసరికల్లా బైటికి చెప్పకపోయేసేం ఎంతో బెంగపెట్టేసుకొంటుంది. అంతటి అనుబంధం ఉన్న వాళ్ళు ఎప్పుడూ ఈ విధంగా గుసగుసలాడుకోడం నవ్వుకోడం అంటూ లేదు. వీళ్ళ ప్రేమబంధం అంతకంటే ఎక్కువదా? లేక?

బహుశః కొత్త దంపతులయి ఉంటారు. అయితే మాత్రం వాళ్ళకు నిదానంగా ఆలోచించదగిన విషయాలూ, స్పష్టంగా మాట్లాడుకోవలసిన మాటలూ, భవిష్యత్తునిగురించి పడవలసిన ప్రయత్నము ఇవేవీ ఉండవా? ఊఁహూ! వీళ్ళకి అటువంటి గొడవ లేమీ పట్టినట్టులేదు. భూత భవిష్యత్తులతో లేశమాత్రమూ సంబంధములేని కేవల వర్తమాన వాదుల్లాగున్నారు.

వీళ్ళ వ్యవహారం చూస్తూ ఉంటే నారాయణశర్మ జ్ఞాపకం వస్తాడు. వాడికి ఏదయినా ఒకపని చేస్తున్నప్పుడు ఎలా ఉన్నా తరవాత దాని గురించి గొప్పగా చెప్పుకోడం మహా ఆనందం. ఆ మధ్యను రోడ్డుమీద కనబడి అడగకుండానే తన రేడియో ప్రోగ్రాముసంగతీ, అందుకోసమని తన ప్రయాణం ఎలాగూ ఉందని, తన శ్రీమతిని కూడా తీసుకొనివెళ్ళి పనిలో పని మద్రాసు, తిరుపతి వగైరా పర్యటించి వచ్చినవైనం అంతా ఒక గంటన్నర రికార్డు వేస్తేనేగాని విడిచిపెట్టేడు కాడు. వాడి మూలంగా ఆ రోజు డాక్టరు సుందరంగారు పాఠం మానివేయవలసి వచ్చింది. చేతనయితే తాను పని బాగా చెయ్యడంవల్ల కీర్తి ప్రతిష్ఠలు వస్తాయిగాని, వట్టి కబుర్లవల్ల వస్తాయా? వాళ్ళిచ్చిన అరవైకితోడు మనకి మరొక నూరు మొత్తం నూటరవై ఖర్చయిందన్నది వాడి పాటకి పల్లవి. ఎంత మంది ఎంతెంతలేసి మొత్తాలు ఖర్చుపెట్టలేదు; డబ్బు ఉంటే ఖర్చు పెడతాము, లేకపోతే లేదు అందులో విశేషం ఏముంది?

అదికాదు వాడి బాధ, తాను మా అందరికన్నా ముందునుండి పాఠాలు చెప్తున్నాడు; ఆ పనిలో తనకు పాతవాడన్న కీర్తి తప్ప మరొకటి ఏదీ మిగలలేదు ఇప్పటికి. అయితే కొన్నాళ్ళపాటు తక్కినవాళ్ళంతా కేవలం సంగీతం ట్యూషన్ల మాష్టర్లు మాత్రమే అయి ఊరుకొంటే, తాను రేడియో నాయకుడుగా గొప్పవాణ్ణను కొండికి వీలుండేది, ఇప్పుడు ఆ వ్యత్యాసము పోయింది, మరి వాడి గొప్పదనాన్ని ఏలా ప్రదర్శించుకోడం? దంపతులం కలిసి పర్యటించి వచ్చేమనడం, ఎదుటివాడు బ్రహ్మచారికదా, కొస

లోపల బాధపడడా అనేకదూ. వాళ్ళు గృహస్థులుగా గడుపుతున్న జీవితం ఎటువంటిదో తెలియకపోతే ఇంకా బడాయి చెప్పి ఉండుదు కాబోలు. అన్నయ్య అవతల స్కూల్లో తెలుగు పండితుడుగా జీతం తెస్తున్నాడు; ఇంటివద్ద తెలుగు హిందీ ట్యూషన్లు చెప్తున్నాడు. అయితే కూడా అతికష్టంగా ఉంది ఇల్లు గడవటం. తాను సంగీతపు ట్యూషన్లు చెప్పి తెచ్చే కుమారు వంద రూపాయలు కూడా ఉండబట్టే ఏదో ఇలాగ గడిచిపోతున్నది. అటువంటిది బద్ధకస్తులైన నారాయణశర్మలాటివాళ్ళు, ఉన్న నాలుగు పాఠాలయినా శ్రద్ధతో చెప్పలేకపోతూ కూడా వైభవం వెలిగిస్తున్నట్లు కబుర్లు చెప్తే ఎలాగుంటుంది?

అయినా చెప్పడం మానరు. తాను ఇంతవరకూ వస్తున్న పెళ్ళి సంబంధాలను ఇష్టం లేకే కాదంటున్నా, తనకు పెళ్ళి ఇంకా కాలేదు కాబట్టే ఆ విషయంలో తనను చూసి జాలిపడితే నేగాని ఊరుకోలేదు లోకం. సాంసారిక జీవితంలోని ఇబ్బందులు తెలిసి తెలిసి కూడా పెళ్ళి చేసుకోండికి సిద్ధపడడం అంటే కావాలని చిక్కులు తెచ్చి పెట్టుకోడమన్న మాటే. ఇప్పుడు తనకు ఏంలోటు వచ్చింది, తన స్వేచ్ఛకి భంగకరమయిన ఇంగ్లీషు కాలేజీ చదువు విడిచిపెట్టాడు. ఎంత రెంత వెనక్కి తీసినా నిస్పృహపడకుండా కృషిచేసి సంగీతంలో గవర్నమెంటు సర్టిఫికేట్లు సంపాదించేడు. ఇక యూనివర్సిటీ డిప్లమో పొందే రోజు కూడా అట్టే దూరంలో లేదు. వీటన్నిటికీ తోడు జనసామాన్యానికి కావలసిన అర్హత, రేడియో గాయకత్వం కూడా ఉంది. ఆర్జన కూడా ఒక మాదిరిగా తృప్తికరంగానే ఉంది. అయితే తాను ఇంకా తాపత్రయపడుతూ వస్తుందని ఆశ ఉన్న చోట మరి కొంచెం బిగిస్తూ ఉంటే ఇంకా మరికొంత రాకపోదు. కాని, అంతకంటే ఇదే బాగుంది; తనస్వేచ్ఛకి అడ్డులేదు. తనచేత పాఠం చెప్పించుకొనేవాళ్ళు కేవలం తనకు ఏదో నెల జీతం ముట్టచెప్పి ఉద్ధరిస్తున్నామనుకో నక్కరలేదు. ఒకటి రెండు చోట్ల సంగీతం మరి వచ్చే ఆస్కారం లేదన్న మాట తాను స్పష్టంగా చెప్పివేసేడు కూడా. తరవాత "ఎలారాదో, నేను చూస్తాను, మూడేళ్ళలో కచేరీలు చేయించి రేడియోలో పాడించడానికి నాదేది కదవా" అన్న పండితప్రవరులు లేకపోలేదు. వారే బాగుపడనీ తనకు మాత్రం అటువంటి అన్యాయవిత్తం అక్కర్లేదు. ఇంతకీ తనకేం పెద్దకుటుంబమూ సాదరబందీ ఏమీ లేదు. ఇప్పుడు వంద రూపాయలు తెచ్చినప్పుడు ఎలా ఉంటున్నారో, రెండేళ్ళ క్రితం పాతికా ముప్పై తెచ్చినప్పుడు అలాగే ఉన్నారు అన్నయ్య వదినాను; ఇంటర్మీడియేటు చదవని సంగీతం ప్రారంభించినప్పుడూ అలాగే ఉన్నారు. అప్పుడు లోపల్లోపల ఎక్కువభయపడ్డారంటే, ఇటు మామూలు ఉద్యోగమూ, అటు సంగీతమూ కూడా కాకుండా పోతుందేమో, కుర్రవాడి భవిష్యత్తు ఏమవుతుందో నని తప్ప ఏదో పెద్ద చదువు చదివి గొప్ప ఉద్యోగం చేసి, తమకు ఆర్జించి పెట్టాలని కాదు. ఇప్పుడయినా తను ఆర్జించిన డబ్బు పోగుపెట్టి కాబోయే తన భార్యకు ఏదో నగ చేయించి పెట్టాలనే అన్నయ్య అభిప్రాయం. అమన్యను వదిన కూడా అన్నయ్యతో అలాగే అనడం తనకు వినబడకపోలేదు, "మతి తప్పనిసరి ఖర్చులు వచ్చి పడుతూ ఉంటే ఏంచేస్తాం, ఇప్పుడు డబ్బు మిగిల్చి బంగారం కొనడం అంటే సర్వాబద్ధం. అయితే పిల్లకి బంగారం పెట్టాలంటే నా గొలుసు పెట్టేస్తాం" అని—వాళ్ళు సనాతనులు గనక, తన యీ స్వల్పమయిన ఆర్జనకూ కుటుంబఖర్చు నిమిత్తం వాడుకున్నందుకు ఇంతలా అనుకొంటున్నారు గాని మరొకళ్ళయితేనా? అయితే వాళ్లు మంచితనంకొద్దీ ఇన్నాళ్లనుకోవచ్చును గాని, తనుమాత్రం పుచ్చుకుంటాడా? అసలు వాళ్ళు తనను అంత ఆదరంతో పెంచి పెద్ద చేసినందుకు తాను ఏంచేసినా తగిన ప్రత్యుపకృతి కాదు. స్కూలు ఫైనలు పాసయి, పైచదువు చదవకుండా, ఉద్యోగం చెయ్యకుండా సంగీతం పేరుతో ఆరేళ్ళపాటు హాయిగా తిని తిరిగేమనిషిని, కుటుంబ కాలక్షేపం నిమిత్తం తాను స్వయంగా అహర్నిశలు పరిశ్రమిస్తున్న ఏ అన్నదమ్ముడు భరిస్తాడు. అన్నదమ్ముడు కాదు, ఎందరు తల్లిదండ్రులకు మాత్రం అటువంటి సహనం ఉంటుంది, అర్థంలేని, అధమం తత్త్రయత్నమయినా కనబడని యుక్తవయస్కులయిన కొడుకులంటే—అన్నయ్యకి "ఒక్కగానొక్క తమ్ముడు; చిన్నప్పుడే తల్లిదండ్రుల అభిమానానికి నోచుకోలేదు." అన్న ప్రేమ ఉండొచ్చు. కాని, వదినగారుకూడా ఈవిషయంలో అన్నయ్యకి తీసిపోయేది కాదు; స్వంతపిల్లలకంటె ముందుగా వాళ్ళకు పెట్టించేకంటె మంచిబట్టలు కుట్టించేది; అన్నయ్య ఏమలాగంటే, వాళ్ళు చిన్నపిల్లలు, ఇంకా బట్టల పొదుపు తెలియదు; శంకరం అయితేనో, బట్టల విలువ తెలుసును; వాటిని జాగ్రత్తగా ఉంచుకోగలడనేది. అసలు ఆ జాగ్రత్త మప్పినది అదిడే—వాళ్లు ఇంత మంచివాళ్లు కాకపోతే, తాను మధ్యలో తన సంగీతశాస్త్రాభ్యాసము విడిచిపెట్టి తనకు ఎంతమాత్రమూ ఇష్టంలేని ఏ గుమాస్తాపనో చేస్తూఉండును. తనకి జీవితంలో ఒక కళని సాధించేనన్న ఆనందమూ, తృప్తిమాత్రమే కాక ఆత్మగౌరవానికి లోటులేకుండా బ్రతికగలిగే సావకాశం కలిగిందంటే, ఇదంతా అన్నయ్యా వదినా వాళ్ళిద్దరి ఆదరణే కారణము. తాను ఆ జన్మాంతం పెళ్ళిమానేసి వాళ్ల సేవచేసినా వాళ్ళ ఋణం తీరదు. అయితే తాను పెళ్లిమానేస్తే మానెయ్యవచ్చునుగాని, వాళ్ళకి చేసేసేవంటూ ఏమీలేదు.

అన్నయ్య ఎప్పటిలాగే కష్టపడుతున్నాడు; ఇంకా మరి నలుగురు ట్యూషన్లకి రావాలిగాని వస్తే మరొకటి రెండు గంటలు కష్టపడడానికి సిద్ధమే. ఇక వదినగారి ఇంటిపని క్రమంగా హెచ్చేదేగాని తగ్గేదికాదు; అయితే తాను ప్రస్తుతం చేయగలుగుతున్నదల్లా ఏదో కొంత తన ఖర్చులకు పోను ఇంటికి ఇవ్వడం—ఇంతే తాను వాళ్ళకు చెయ్యగల సహాయము.

అయితే ఇందువల్లనే వాళ్ళకు మరింత గాభరాగా ఉంది. వీలయినంత వేగంలో తనకూ పెళ్ళిచేసి తనను ఒక గృహస్థును చెయ్యాలని. తీరా అయినతరవాత ఇప్పుడు అన్నయ్యకు చాలీ చాలడంగా ఉన్నట్టే అప్పుడు తన ఆర్జన తనకు కూడా చాలక పోవచ్చును. అంతేకాదు, అన్నయ్యకు చిన్నతనంనుండి కష్టపడి, ఓపికగా పనిచెయ్యడం అలవాటు. తనకు చదివినప్పుడు అట్టే

కష్టపడనక్కరలేకుండానే పరీక్షలు పాసయేడు; సంగీతంగురించి పరిశ్రమించినా అనేక కష్టంగా తోచేదికాదు; అయితే తన ఆనందంకోసం పాడుకోడం వేరు. ఏదో విధిగా పాఠం చెప్పడం వేరు. ఏదయినా పెళ్ళిచేసుకొంటే తనకు ఇప్పటి ఈ స్వేచ్ఛ, సంతృప్తి ఈ రూపంలో ఉండవు; వీటిలోని లోటును కప్పగలగవచ్చు లేకపోవచ్చు; ఎలా ఉంటుందో సాంసారిక జీవితం ఏదయినా దిగితేగాని లోతు తెలియదు.

పెళ్ళికొడుక్కి అర్హతఉన్నా ఉద్యోగం లేదు; పెళ్ళికొడుకు అన్న వితంతు వివాహం, చేసుకున్నాడు; ఇవి చాలా మందికి ఉండే అభ్యంతరాలు. అవి కాదని వచ్చిన సంబంధాలు అన్నయ్యకి నచ్చవు; అన్నయ్య ఎలాగో సమాధానపడదామన్నా అన్నీ సవ్యంగా లేకుంటే వదిన యిష్టపడదు. ఇన్నీ కుదిరినమీదట ఇంకా ముఖ్యమైనది పెళ్ళికొడుక్కి ఇష్టం కావడం కాకపోవడం ఒకటి ఉంది. అయితే యీ ఆలస్యంమూలంగా అన్నయ్యకూ వదినకూ మరింత ఆందోళనకలుగుతున్నదితప్ప మరొకటి లేదు.

“నీ పెళ్ళిమూలంగా మీ రిద్దరూ సుఖంగానే ఉన్నారుకదా; నేనూ నీలాగే వితంతువివాహం చేసుకొంటా నన్నయ్యా” అంటేమాత్రం అన్నయ్యకు ఇష్టంలేదు. అప్పుడు తన పరిస్థితిలో అనేక తప్పని సరి అయిందనీ, ఎంచేతంటే, తనకు మొగంమీద స్ఫోటకం మచ్చలుండడమూ ఆర్థికస్థితి ఏమీ తృప్తికరంగా లేకపోవడమూను—కాని, ఇప్పుడు పరిస్థితులు కొంత మారాయి; పెళ్ళికొడుకుల విలువ పెరుగుతున్నది. పైగా చాలామంది సత్సంప్రదాయకులయినా వాళ్ళే పిల్లనిస్తామంటూ వచ్చేరు. అయితే వాళ్ళ సంబంధాలు మరేవో కారణాలవల్ల యిష్టపడలేదు. అంచేత కొంచెం ఓపికపట్టి సరైన సంబంధం చేసుకోవాలిగాని, అన్నతమ్ములిద్దరూ పెళ్ళికాక వితంతు వివాహం చేసుకున్నారనిపించుకోడం మాట అలాగ ఉండగా, రేపు పొద్దున్న తమ పిల్లల పెళ్ళిళ్ళకు కూడా చాలా యిబ్బంది పడవలసివస్తుంది. మరి గత్యంతరం లేదన్నప్పుడు ఎలాగూ తప్పేది కాదుగానీ, కావాలని ఇబ్బందులు తెచ్చుకోడం ఏమి ప్రయోజకత్వం? అని అన్నయ్య ఉద్దేశం. ఏది ఎలాగయినా, తన చిన్నతనంనుండీ అన్నయ్యకు తన మూలంగా ఏవో ఇబ్బందులూ ఆందోళనే తప్ప మనస్సుకు శాంతిలేదు. అయితే తాను చెయ్యగలిగిన పని ఏదీ అన్నయ్యకు తృప్తిపరచడం నిమిత్తం చెయ్యకుండా ఉండలేదు......

అలా ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయేడో తెలియకుండానే నిద్రపోయేడు. మెలకువవచ్చి చూసేసరికి వాచీ రేడియమ్ డయలు అస్పష్టంగా ఒంటిగంటన్నరను చూపుతూంది. లేచి పెళ్ళిమంచంమీద పడుక్కున్నాడు ఉదయం అయిదుగంటలకల్లా లేచిపోవాలని జ్ఞాపకం చేసుకొంటూను.

రాత్రి ప్రక్కగదులనుండి వినిపిస్తున్నమాటలు తన నిద్రకు భంగకరంగా ఉన్నాయని విసుక్కున్న శంకరశాస్త్రి, తానేమిటి చేస్తున్నాడో తెలియకుండానే, ఉదయం నిద్రలేవగానే కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలు చదవడం ఆరంభించాడు; చాలకాలమయి అయిన అలవాటు మరి. అయితే మొదటిశ్లోకం పూర్తి అయేవేళకు హోటలు వాతావరణాన్నిగూర్చిన ఆలోచన స్పష్టంగా మనస్సులో మెదిలింది. రెండుమూడు శ్లోకాలు మనసులోనే అనుకొని, సంచీలోని పలుతోము పుడక తీసి పిట్టగోడ దగ్గరకు వెళ్ళి పళ్ళుతోముకోడం ప్రారంభించాడు.

ఇరుగుపొరుగుల గదులలోని వారెవరూ ఇంకా లేచిన అలికిడి లేదు; కాగా, పోగా తాను శ్లోకం బిగ్గరగా చదవడం పొరపాటే అయినా అందువల్ల ఇతరులకు ఇబ్బంది కలక్కపోడంవల్ల కొంత తృప్తిపడవచ్చునుగదా! కూజాలోని నీళ్ళతో మొగం కడుక్కొని, మరికొంచెంసేపు ఆగితే వేడినీళ్ళు దొరకగల అవకాశాన్ని కాదని, అప్పుడే చలినీళ్లు స్నానం చెయ్యదల్చుకున్నాడు.

తువ్వాలు పై మీద వేసుకొని స్నానానికి బయలుదేరేడు, మెల్లగా పాడుకొంటూ. సరిగ్గా పక్క గదిలోనుండి ఆవిడ అదే సమయంలో కూజా చేతితో పట్టుకొని వస్తూంది. ఇద్దరూ త్రుళ్ళిపడి గతుక్కున ఆగారు. లేకుంటే ఒకరి నొకరు ఢీకొనవలసిందే. తానెంతో తప్పుపనిచేసినట్లనిపించింది శంకరశాస్త్రికి. తాను వెళ్లిపోతేనేగాని, ఆవిడ గుమ్మందాటి ఇవతలికి రాదని, తానే సాగిపోయేడు, స్నానాలగది వంకకు, పాడుకొంటూ కాదు, ఆలోచిస్తూనూ. స్నానంచేసి తిరిగివచ్చేసరికి, ఆమె పిట్టగోడ దగ్గరే నిలబడి మొగం తుడుచుకొంటున్నది. అనుకోకుండానే ఆమె వంక చూసి, ఆమె కూడా తనను పరికిస్తున్నదని గుర్తించేడు శంకరశాస్త్రి.

మొగంలో గతరాత్రి వెల్లివిరిసిన నవ్వుకూ కులాసాకు ఎక్కడా పోలిక కనబడలేదు. చాలా గంభీరంగా ఉన్నట్లనిపించింది. కాబట్టే ఆకృతినిబట్టి మనఃప్రకృతిని నిర్ణయించబోవడం తెలివితక్కువనుకొంటూనే బట్టలు కట్టుకోసాగాడు.

తన శ్లోకపఠనంవల్లనే ఆమె నిద్రాభంగమయిఉంటుందా? అలా అయిఉంటే మాత్రం, ఇంత వేగంగా ఎందుకు మొగం కడుక్కొంటుంది? నిద్ర చెడిపోయినందుకు మనసులో తిట్టుకొంటూ పక్కమీదనే పడుకొని ఉండును. ఆమెకి కూడా తనలాగే తెల్లవారగానే లేచిపోవడం అలవాటేమో? అంతే అయిఉంటుంది. చొక్కా పంచీ బాగానే ఉన్నాయి. పైమీద జరీ వేసుకోవడమా మానడమా అన్న అనుమానం వచ్చింది. ఆలోచించి ఇప్పుడిలా కిందికి టిఫినుకు మాత్రమే. తరవాత అక్కడికి రేడియోస్టేషనుకి బయలుదేరేటప్పుడు ఎలాగూ తప్పదు అనుకొని తీసిన వాణీ వంకెకు తగిలించి గది తాళం వేసుకొని బయలుదేరేడు.

ఆవిడ గది గుమ్మంలోనే నిలబడి ఉంది. ఈమారు పరధ్యానంగా కాకుండా గుమ్మానికి బాగా ఎడంగానించి వస్తున్న అతణ్ణి ఆమె గొంతు నిలవరించింది. ఎవరో ఏమిటో తెలియని తనతో ఆమె మాట్లాడుతుందని ఊహించలేక పోడంచేత వింతగా తోచిందిగాని, ఆమె అడిగినమాట చాలా సామాన్యమయినదే.

"మీరు కిందికి వెళ్తున్నారు కాబోలు, హోటలు కుఱ్ఱవాడిని ఇటు ఒక్కమారు పంపించండి, కాఫీ తెచ్చిపెట్టడానికి." అంది.

అతను "అలాగే పంపిస్తాను", అన్నమాటకి ఎక్కువ తడబాటు పడకపోయినా, ధ్వనిమాత్రం మామూలుగా లేదు—అమాత్రం గాభరా అయినా తానెందుకు పడాలి? తను పాఠం చెప్పే పిల్లలతో గాని (వాళ్లలో కొందరికి ఈమె వయస్సుకి తక్కువ ఉండదు) వాళ్ల తల్లులతో గాని, ఆడవాళ్లతో మాట్లాడ్డానికి తానేమీ గాభరాపడడం లేదే. ఇప్పుడుమాత్రం, తాను పెద్ద గాభరా పడినట్టు ఏమిటి నిదర్శనం? ఏదైనా ఆలోచిస్తున్నప్పుడు, హఠాత్తుగా ఎవరయినా పిలిచినా, ఏదైనా కొత్తధ్వని వినిపించినా త్రుళ్లిపడినట్లుగానే; తనతో సంబంధంలేని వ్యక్తి మాట్లాడ్డం కొంచెం తనలో మార్పును తెచ్చిఉంటుంది.

క్రిందికి వెళ్తూనే హోటలు కుఱ్ఱవాణ్ణి మీదికి పంపించేసి, తన ఫలహారమూ కాఫీ ముగించుకొని, కిల్లీ వేసుకొని, ఇంకా బాగా గంటన్నర టైముఉన్నా అప్పటికప్పుడు అదరాబాదరాగా వెళ్లేకంటె కాస్త ముందు వెళ్లడమే మేలని దగ్గరలో ఉన్న రిక్షావాణ్ణి పిలిచేడు.

పాడు వచ్చిన తరవాత రిక్షా ఎక్కబోతూ ఉండగా ఏదో లోటయినట్టు కనిపించింది... పై మీద వాణీ లేదు; అదీ కాక, రెండు గొంతునొప్పి బిళ్ళలుకూడా జేబులో వేసుకోడం మంచిది అనుకొని మళ్ళీ మేడమీదకు వెళ్లేడు. ఈమారు ఆవిడ ఏమయినా మాట్లాడితే చాలా సహజంగా ప్రత్యుత్తరం చెప్పాలని కృతనిశ్చయుడై ఉన్నాడు. అయితే ఆవిడ హోటలుకుఱ్ఱవాడికి ఏదో ఆర్డరు చేస్తూఉంది గదిలోకి వెళ్తూ ఉండగా. తిరిగి వస్తూన్నప్పుడు తనవంక చూడకపోలేదు. కాని, ఏమీ మాట్లాడలేదు—

నిన్నరాత్రి వాళ్ళనవ్వులమూలంగా నిద్ర పాడయిందనుకొన్నాటే రిక్షాలో కూర్చున్నంతసేపూ, వాళ్లనుగురించినవే ఏవేవో ఆలోచనలు. వీళ్లు ఎవళ్లు; ఎందు కిక్కడికి వచ్చినట్టు? ఎన్నాళ్లిక్కడ ఉంటారు? వాళ్ల దృష్టిలో తానెలా కనిపించి ఉంటాడు? ఆవిడ మొగంలో తన శిష్యురాలు రాజ్యలక్ష్మి కళ కొంత ఉంది. కాని అంతకంటె పొడుగు తెలుపు; పేకేమిటో?

ఏపేరయితే ఏమి, ఏ ఊరయితే నేమి, తాను రేపు మధ్యాహ్నంతో రైలెక్కిపోవలసినవాడు. వాళ్లు మాత్రం, శాశ్వతంగా హోటలులో ఉండిపోరు కదా! రైలులో ఎక్కిన ప్రతివాళ్లు ఎక్కడో ఒకచోట దిగిపోవలసినవాళ్లే. వీళ్లూ, కొంచెం ముందు వెనక లన్నమాటగాని, హోటలు విడిచి వెళ్లిపోవలసినవాళ్లే...నూత్న దంపతులేమో? పాశ్చాత్య సంప్రదాయ ప్రకారం వివాహానంతరం ప్రణయసంచారం చేసిరావడానికి బయలుదేరేరేమో! నిర్విచారంగా ఖర్చుపెట్టడానికి తగిన స్థితి ఉంది కాబోలు. ఈ వాడు తన డబ్బుకోసం నానా తాపత్రయ పడి ఇంతమేరవచ్చినట్టే, డబ్బున్నవాళ్లకి దాన్ని ఖర్చుపెట్టడానికికూడా ఇంత పరిశ్రమ చేయవలసిఉందన్నమాట! తనకే నిర్విచారంగా జీవిక గడిచిపోయేపాటి ఉపాధి ఉంటేనా! పేరు ప్రతిష్ఠలు, ధనార్జన అన్న ప్రసక్తి లేకుండా హాయిగా ఒక కుటీరం వేసుకొని, పాడుకొంటూ, నిజంగా సంగీతం అంటే భక్తి శ్రద్ధలుగల ఏకొద్దిమందికో పాఠాలు చెప్పుకొంటూ కాలక్షేపం చెయ్యగలిగే కంటే ఆనందం ఇంకేముంది. అనుకొంటున్నాడేగాని, తీరా డబ్బుంటేసరికి తనకూ మామూలుగా డబ్బున్నవాళ్లకి పుట్టే సరదాలే పుడతాయేమో! అప్పుడూ తానూ ఇలాగే భార్యతో సహా దేశయాత్రలకి బయలుదేరి, హోటలు జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఉండునేమో? అప్పుడు తమ దంపతులను చూసి, ప్రక్కగదిలో బస చేసిన బ్రహ్మచారి గాయకుడికి ఈర్ష్యగా ఉండునేమో! ఛ! ఛ! అదేమిటామాట— తా నిప్పుడు వాళ్లనుచూసి ఈర్ష్యపడవలసిన అవసరం ఏమీ లేదే. తనకు వివాహం కావడం తాను ఒప్పుకొంటే, అతి సామాన్యమయిన విషయమే; తరువాత, దంపతులు కలిసి ఈవిధంగా పర్యటించడమూ ఏమీ విశేషమయిన సంగతి కాదు. కాబట్టి వాళ్లని గూర్చి తనలో లేశమాత్రమయినా ఈర్ష్య లేదు. నిన్నరాత్రి వాళ్లగుసగుసలూ నవ్వులూ గాజుల గలగలలూ కొంతవరకు తన నిద్రను పాడుచేసినట్టే, నేటి ఉదయం ఆమె చాలా సామాన్యమయిన సంగతి అయినప్పటికీ, ఏమీ పరిచయంలేని తనతో మాట్లాడ్డం అన్నది కొంచెం వింతగా తోచి వాళ్లనుగురించి ఈ మాత్రం ఆలోచించడం జరుగుతోందిగాని లేకపోతే వాళ్లను గురించిన తలపే తనమనసులోకి రాకుండా ఉండును.

రేడియో స్టేషనులో పాట ఎనిమిదిన్నరకే అయిపోయి అక్కడి పాతస్నేహితులను బలపరచుకోవడం, కొత్తవాటిని విత్తులు నాటడం మొదలయినపనిలో పదకొండుగంటల దాకా గడిచిపోయింది.

త్వరగా హోటలుకువెళ్లి భోంచేసి తన గదిలోకి వెళ్తూ ఉండగా అప్రయత్నంగా ప్రక్కగది తాళంవేసి ఉండడాన్ని గుర్తించేడు. ఏకంగా వెళ్ళిపోయేరో, లేక ఊళ్ళోకి ఎక్కడికయినా వెళ్ళేరో? ఇంకా ఫిబ్రవరి పూర్తి కానేలేదు. అప్పుడే ఎంత ఎండగా ఉందో, అనుకొంటూ తన గదిలో ప్రవేశించి, బనియను లుంగీ కట్టుకొని, పక్కమీద పడుకొన్నాడు. ఒక గంటేఅయినా నిబ్బరంగా నిద్రపట్టింది. ఎన్నో గంటలు నిద్రపోయినంత హాయి అనిపించింది. ఇప్పటినుండీ చేసేపని ఏమీ లేదు, మరొక్కగంట ఇలాగే నిద్రపోగలిగితే రాత్రి రెండవఆట సినీమాకు వెళ్ళినా చిరాకు ఉండదనుకొంటూ మళ్ళీ కళ్లుమూసుకొన్నాడు.

ప్రక్కగది తెరుచుకొన్న చప్పుడయింది. ఇందాకా వాళ్లు వెళ్ళిపోయిఉంటే మరెవళ్ళో కొత్తవాళ్ళు ప్రవేశిస్తూ ఉండి ఉండాలి. ఉహుఁ కాదు వాళ్ళే. ఆ గొంతు తనకు బాగా తెలిసినదే. అదివరకు ఎన్నాళ్ళనుండో వింటున్న గొంతులకంటె బాగా పరిచయమయినట్టుంది ఆ గొంతు. ఇంత చక్కటి గొంతున్న తరవాత కొంచెమయినా సంగీతం రాకపోయి ఉంటుందా? లేక వీళ్ళు గాని, కొంపతీసి రేడియోఆడిషను నిమిత్తం రాలేదుకద! వస్తే

మాత్రం తనకేం, తనపని తనది, వాళ్ళపని వాళ్ళది......ఏమిటి చెప్మా అవిడ అంటున్నది. మాటలు గతరాత్రిలాగ ఏకాంతంగా లేవు. స్పష్టంగా వినిపిస్తున్నాయి. "నేను కూడా ఎందుకు అక్కడికి నే నిక్కడే ఉంటాను" ఇది ఆమె గొంతు. రెండవ గొంతు కొంచెం కీచుగా ఉందిగాని మగగొంతుకే. "ఇక్కడ ఈ హోటల్లోనా? అంతకంటె..."—మళ్ళీ ఆమె గొంతు "మరేం భయం లేదు, నా కిక్కడే బాగుంది; ఇకేం ఊరుగాని అడివి కాదుకదా! ఇంతకీ ఇవాళకీ రేపురాత్రికీ ఏమి భయం? రేపురాత్రి రయిలుకే కదూ రావడం?" "వెళ్ళినపని ఈ రాత్రే అయిపోతే, రేపు మధ్యాహ్నం మూడుగంటలకే వచ్చేస్తాను; లేకపోతే రాత్రికి; మరి నాకు ట్రెయినుటయిమయింది; నేను వెళ్తున్నాను. నీ ఒక్కతెవూ ఇక్కడ ఉండేకంటె నాతో వస్తే వచ్చిన ప్రమాద మేమిటి?"..."మరి మళ్లీ మొదలయితే నేను చెప్పలేను. నేను రావడంవల్ల మనకీ వాళ్ళకీ కూడా సుఖం ఉండదు. అంచేత నేను ఇక్కడే ఉంటాను. నా గురించి మరేమీ గాభరాపడక్కర్లేదు. రేపురాత్రి రావడంతో ఎల్లుండి ఉదయమే మన ప్రయాణం అన్న మాట"—"అందుకు అనుమాన మేముంది; మరి నాకు టయిమయింది. వస్తాను"...తలుపు దడాలున తీసుకొని మళ్ళీ దగ్గరగా వేసి వెళ్లిపోయిన సవ్వడి అణగిపోగానే గతరాత్రి నవ్వులలో గాని నాటి ఉదయం వినిపించిన మాటలధోరణికి గాని ఏమీ సంబంధం లేని ఇంకోరకం ధ్వని స్వల్పంగా వినిపించింది శంకరశాస్త్రికి. ఆమె ఏడుస్తోందా? మాటలో గాని, పలికిన ధోరణిలో గాని ఎక్కడా విచారించినట్లు లేదే. ఇప్పటి కిప్పుడు ఇంత ఏడుపు ఎందుకు వచ్చిందో? అంత ధైర్యంగా తన కేమీ భయం లేదని చెప్పింది. కేవలం ఒంటరిగా ఉండడానికి కలిగిన భయం అయే మాటైతే, మాటవరసకయినా తానూ వస్తాననో, లేక అతనిని వెళ్ళవద్దనో అని ఉండదా? 'కుణకుణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్న కవి చాలా గొప్ప అనుభవజ్ఞుడయి ఉండాలి! ఉన్నట్టుండి ఏడవాలంటే తనవంటివాడికి ప్రయత్నించినా సాధ్యంకాని పని.

మూడు గంటలకు కాఫీకి క్రిందకు దిగివెళ్తున్నప్పుడు, తరవాత నాలుగున్నర ప్రాంతంలో వీధిలోకి వెళ్తున్నప్పుడు ఆమె గది తలుపు లోపల వేసిఉంది. సాయంకాలం అంతా అలాగే ఉంది కాబోలు. తాను రాత్రి రేడియోపాట పూర్తయాక వచ్చి, భోజనం చేసి తన గదిలోకి వెళ్లేటప్పుడూ తలుపు లోపల వేసేవుంది. తాను బట్టలు మార్చుకొని పేపరు చదువుకొందా మనుకొంటూ ఉండగా మాటలు వినిపించేయి.

"అమ్మా, అయితే మరి భోజనం ఇక్కడికే తీసుకొని రమ్మన్నారా?"

"ఓహో, ఇక భోజనాలు సరి కాబోలు. సరే, తీసుకొనిరా". అంటే ఇంతసేపూ ఇక్కడే ఉండికూడా భోజనం చెయ్యలేదన్న మాట. అంటే, ఏదో విచారంతో బాధపడుతూ ఉండిఉండాలి. ఏమిటో కారణం? తెలిసినా తాను చేయగల సహాయం ఏమిటి? రేపు మధ్యాహ్నం తన చెక్కు మారితే సాయంకాలం రయిలుకి బయలుదేరిపోవలసినవాడు తాను. కారణం తెలుసుకొని తానూ విచారించడం తప్పిస్తే ప్రయోజనం ఏముంటుంది? ఇంతకీ గోడలు దళసరిగా లేకపోవడం మూలాన కొన్ని ధ్వనులు వినిపిస్తాయి తప్ప ఆవిడ విచారిస్తున్నట్టు తన కేమిటి నిదర్శనం?

ఇదే సామీప్యములో ఉండే మాహాత్మ్యం కాబోలు. ఈ మనిషితో తన కేటువంటి సంబంధమూ లేదు, ఇకముందు ఉండబోదు కూడాను. అయినా, ఈమె స్పష్టాస్పష్టంగా పడుతున్న బాధ తన మనసును ఎంతో కలవరపరుస్తున్నది. దూరంగా ఉన్నవాళ్లు, తన కెంతో తెలిసినవాళ్లు కావలసినవాళ్లు ఎన్నో బాధలు పడుతున్నారన్న విషయం స్పష్టంగా తెలిసికొన్నా మనస్సుకి అట్టే పట్టినట్టు ఉండదు.

తొమ్మిదవడంతో సినిమాకి బయలుదేరాలని కుర్చీలోంచి లేచాడు. కాని అప్పటి కింకా ఏ సినిమాకి వెళ్లడమో నిశ్చయం కాలేదు. మంచి సినిమాలన్నీ తా నిదివరకు చూసినవే. తక్కినవి ఎలా ఉంటాయో? తీరా వెళ్ళి నిద్ర దంచుకొందనుకొనే మాటైతే అంతకంటె, చూసినదే అయినా బాగున్నదే మళ్ళీ చూస్తే? ఏదీ కాదు, రిక్షావాడిని వాడికి నచ్చిన సినిమాకి తీసుకొనివెళ్లి పొమ్మంటే తీరిపోతుంది. అయినా ఈ మధ్యను కొన్నాళ్ళుగా తనకు ఒంటరి సినిమా చూసే అలవాటు పోయింది. తోడుగా ఎవళ్లయినా ఉన్నారంటె, చూసే సినిమా ఏదయినా ఆనందంగానే ఉంటుంది—ఇవాళ కింతే—అయితే ఇదీ ఒక అనుభవమే—ఒంటరిగా చూస్తున్నప్పుడు తన మనస్సు ఏ విధంగా ప్రవర్తిస్తుంది? సినిమాలోని బాగోగులను గురించిన విమర్శన ఏ విధంగా ఉంటుంది?

డబ్బు చెక్కూ ఉన్న పర్సు పెట్టెలో పెట్టి, జేబులో కొంత చిల్లరా ఒక రెండు రెండు రూపాయల నోట్లూ పెట్టుకొని బయలుదేరేడు. ఆమె తన రాకకి ఎదురుచూస్తున్నదేమో అన్నట్టుగా గదిగుమ్మంలోనే నిలబడిఉంది. మళ్ళీ ఉదయంలాగు ఏదైనా చిన్నపని చేసిపెట్టమంటుంది కాబోలు అన్న ఊహ అతని మనస్సులో మెదుల్తూ ఉండగానే ఆమె బాగా పరిచయం ఉన్నట్లుగానే "సినిమాకి కాబోలు బయలుదేరేరు" అంది.

నడుస్తున్నవాడల్లా ఆగి "అవునండి; ఏమీ తోసుపోవడం లేదు" అన్నాడు. అనడమేమిటి తన పని పూర్తిఅయిపోయింది కాబోలు, ఇక వెళ్లిపోదా మనుకొంటూ ఉండగా ఆమె అడిగింది. "నేనూ మీతో కూడా వస్తే మీకేం అభ్యంతరం లేదుకదా?" అంది. ఇటువంటి ప్రశ్నకు మామూలుగా అయితే, చాలా ఆలోచించవలసిన అవసరం ఉండేదే శంకరశాస్త్రికి. కాని, ప్రస్తుతం మరి ఆలోచించడానికి వ్యవధి లేదు. "నా కేమిటి అభ్యంతరం మీరు సినిమా చూడదలచుకొంటే" అన్నాడు అటూ ఇటూ కాకుండా. ఆమెకు అదే చాలనిపించింది కాబోలు, "అయితే ఉండండి ఒక్కనిమిషంలో వస్తున్నాను" అంది. నిజంగా రెండు నిమిషాల్లోనే తాళం వేసుకొని బయలుదేరింది.

వీధిలోవాళ్ళకి తమ వరుస ఎటువంటి సంబంధమూ లేదన్న విషయం తెలియదు, అందువల్ల తమను భార్యాభర్తలనుకొన్నా, మరొకలాగనుకొన్నా ఏమీ బాధలేదుగాని హోటలువాళ్ళకి ఎటువంటి అనుమానమూ లేకుండా తెలుసును. వాళ్లు వచ్చిన కొన్నా

క్లబు తాను వచ్చాడనీ, పేకేగదిలో ఉంటున్నాడనీ, కలిసి తిరగడంగాని మాట్లాడ్డంగాని ఇంతవరకు లేదనీను. అటువంటి సందర్భంలో, రాత్రి రెండవఆట సినిమాకి కలిసివెళ్లడం అన్నది అందులోనూ సరిగా అతడు లేనిరాత్రి చూసుకొని వెళ్లడం, ఇదేమీ మంచి పనిగా లేదు. ఇది తాను ఎటువంటి దురుద్దేశం లేకుండా కేవలం ఆమె అడిగింది, అది తనకేమీ కష్టంలేని పనికదా అని అంగీకరించినప్పటికీ మున్ముందు ఎటువంటివిపరిణామానికి దారితీస్తుందో! అయినా ఒకటి, తనకి ఏదో కొత్తగా ఉన్నట్టుంది, కాని, ఆమె ఇది తాననుకొంటున్నట్టుగా అనుకోడం లేదేమో?

హోటలువాళ్ళతో సినిమాకి వెళ్ళవస్తాను అప్పుడు తలుపు తీయడానికి ఎవరయినా ఉండాలని చెప్పడం మొదలు టికి. జట్కా ఏదయినా ఉంటుందేమోనని ఎదురుచూడడమూ మామూలుగానే జరిగిపోతున్నాయి. లోపల ఆలోచన మాత్రం అలాగే సాగుతోంది.

ఆమె "ఏమిటి చూస్తున్నా"రంది?

"ఏమీ లేదు, జట్కా ఏదైనా కనిపిస్తుందేమోనని!"

"జట్కా ఎందుకు నడిచి వెళ్లిపోలేమూ! అట్టే దూరం లేదుగదా!"

"వెళ్ళిపోవచ్చునుగాని, అంతకంటె పోనీ, ఆ జట్కా అద్దెకి రెండు రిక్షాలు వస్తాయి. ఏదో రిక్షా!"

"సైకిలురిక్షాలో ఇద్దరు కూర్చోడం ఆచారం ఉంటేకదూ రెండెందుకు."

"ఒకటి చాలోయ్"

"ఎక్కండి శాస్త్రులమ్మా"

సినిమా గురించి తానెలాగయితే అనిశ్చయంగా ఉన్నాడో ఆమె కూడా అలాగే అనిశ్చయంగాఉన్న సంగతి అప్పుడు తేలింది. ఇద్దరికీ ఏదైనా బాధలేదు, అలాగని, ఫలానాఇది కావాలని లేదు; ఎలాగయితేనేం చివరికి రిక్షావాడి కాస్టింగు వోటులో నిర్ధారణ అయింది.

రిక్షా నడవడం ప్రారంభించాక ఆమె అతని మనస్సులోని అనుమానాన్ని తొలగించడానికన్నట్టుగా అంది. 'నాకు ఇవాళ ఏమీ తోచుపోడంలేదు. అందులోనూ సాయంకాలం ఒక రెండు గంటలు నిద్రపోయేను. మరి ఇప్పుడు నిద్రపట్టే సూచన కూడా లేదు. అలా పడుకొన్నాని, నిద్రరాకుండా ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు చేసేకంటె, సినిమాచూస్తే అప్పటిమటుకు మనసు మరిచిపోడమే కాకుండా, సినిమా చూసిన పరిశ్రమవల్ల కళ్ళకి నిద్ర వేగం వస్తుంది. అంచేత ఏదో సినిమాకు వెళ్లదలచుకొన్నాను. అయితే తోడెవ్వరూ లేకపోడంచేత, ఇటునుంచి వెళ్లడానికి బాధలేదుగాని అటునుంచి తిరిగి రావడానికి తోడుండాలని, హోటలు కుర్రవాణ్ణి కూడా తీసుకొని వెళ్లాలనుకుంటున్నాను. నాకేం తెలుసును మీరు బయలుదేరుతారనీ? అసలు ఇక్కడి హోటలువాళ్ళకు మీ గురించి కొత్తగా చూడవలసిన స్థితి దాటిపోయింది, ఒకదానికి కాకపోతే ఇంకొకదానికయినా మేము కట్టుబడి ఉన్నట్టు కనిపిస్తేకదూ!"

శంకరశాస్త్రి కేమో తాను ఆమె మాటకు ఏదో సమాధానం చెప్పాలనీ, అనవసరంగా మొగమాటం పడడం తెలివి తక్కువనీ తెలుసును. అయినా, మాటలే స్ఫురించకుండా ఉన్నాయి. స్ఫురించినవయినా ఏమిటో అసందర్భంగా తోచసాగాయి. అతను నిర్ణయించుకొని సమాధానం చెప్పేలోపున ఆమె ప్రసంగం మార్చింది.

"సాయంకాలం మీ పాట ఉంటేకదా వాళ్లే పెడ్తారనుకున్నాను. కాని హోటలువాళ్లు, ఏదో సినిమారికార్డులకోసం స్టేషన్ మార్చి స్టేషన్ తిప్పుతూఉంటే నేను కలుగచేసేను; మీ పాట ఉందనీ, ఈ అరగంటా విజయవాడస్టేషన్ ఉంచమనీను. మన వాళ్లకి కూడా మన సంగీతం అంటే అభిరుచి లేదు"

"హోటలువాళ్లకి మన, పర అన్న భేదం ఏముంటుంది? వాళ్లకి అన్ని సంగీతాలు ఒక్కటే. కనిమాలంగానయితే మరి సరిమంచి హోటలుకి ఆకర్షించబడి, తమ పనులు త్వరగా వెళ్లిపోడానికి వీలుంటే అదే మంచి సంగీతం. తక్కిన అడ్వర్టయిజుమెంటులాగే రేడియో కూడాను. అయితే వేసేదా?"

"అది ఎందుకు వెయ్యద్దు; వేసేరు. అయితే మీరన్నట్టు వాళ్లనని లాభంలేదు. వాళ్ల బేరానికి బాగా దోహదం చేసేదే వాళ్ల దృష్టిలో ఉత్తమ సంగీతం."

"వాళ్ళ దృష్టిలోనే కాదు, సుమారు చాలామంది దృష్టిలో అంతే. సినిమాల్లోనూ, పుస్తకాల్లోనూ, అన్నిటిలోనూ, ఏది ఎక్కువమందిచేత ఆమోదించబడింది? అని. అదే ఉత్తమత్వానికి గీటురాయి. సరేకాని, మీకు"

"ఏమిటి నాకు మీరు రేడియోలో పాడతారనీ, ఈ రాత్రి మీ ప్రోగ్రాం ఉందనీ ఎలా తెలిసిందనా? ఉదయం మీరు వీధిలోకి వెళ్ళిపోయిన తరవాత కొంతసేపు ఆలోచించాను. తప్పకుండా రేడియో పాటకే వచ్చిఉంటారనుకున్నాను. అయితే నాలోనే ననుకుంటే ఏమిటి నిర్ధారణ అని హోటలు కుర్రవాణ్ణి అడిగేను. వాడు నిజమే నన్నాడు. ఇవాళ తప్పకుండా మీ ప్రోగ్రాము ఉంటుందన్నాడు. ఇదివరకు మీరు మూడు నాలుగుమార్లు వచ్చి ఇక్కడే బసచేశారటకూ!"

"అద్భుతంగాని, అసలు మీరు మొదట నన్ను మనిషిని చూసి పాటకుణ్ణని ఎలా ఊహించారో ఆశ్చర్యంగా ఉంది."

"ఆశ్చర్యానికి ఏముంది, గుడ్డివాడి చేతి రాయి. అది అనుకొన్నకంటె బాగా తగిలింది."

సినిమా చూస్తున్నంతసేపూ ఏదో మాటలాడుకొన్నారుగాని శంకరశాస్త్రి కదేదీ సరిగా జ్ఞాపకంలేదు. ఉన్నా తిరుగు ప్రయాణంలో ఆమె అడిగిన ప్రశ్న తన జవాబు వీటిముందు తక్కినవేవీ స్పష్టంగా గోచరించడం లేదు.

ఆమె అడిగింది. "శంకరశాస్త్రిగారుకదూ మీ పేరు, శాస్త్రిగారూ, మీ భార్య ఇలా మీరు లేనప్పుడు, ఒంటరిగా మరెవరో

ముఖ్యం మొగం తెలియని పరాయి మగవాడితో కలిసి సినిమాకి వెళ్ళిందంటే, మీ కెలాగుంటుందండీ ?"

"ఎలాగుండడానికీ అటువంటి పరిస్థితే తటస్థించదు."

"ఎంచేత ?"

"ఎంచేతంటే, నాకు పెళ్ళికాలేదు, భార్యంటూ లేదు గనుక" అన్నది నోటి చివరివరకూ వచ్చిన సమాధానం. కాని, అంతమాత్రం ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పినట్టుకాదే. ఏమంటే తాను వివాహితుడే అయిఉండవచ్చును; కాకపోవచ్చును అటువంటి పరిస్థితిలో ఏమనుకొనిఉండును అన్నదికదా ఆవిడప్రశ్న...

"ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నారు; నాప్రశ్న అసందర్భంగా అసభ్యంగా ఉందనా ?"

ఇప్పటి కప్పుడే సర్దుకొన్నాడు శాస్త్రి. "అసభ్యానికీ అసందర్భానికీ ఇందులో ఏముంది. నేను లేకపోయినా మీరు సినిమా చూడలేకపోరు. ఇందుమూలంగా మిమ్మల్ని ఎవరయినా ఏమయినా అనుకొంటే వాళ్ళ అవివేకమూ తొందరపాటే నిందించదగినవి. కాని"

"చెప్పండి, అనుమానం ఎందుకు ?"

"ఏమీలేదు, నావంటివాణ్ణి అన్ని విషయాలలోనూ కొంచెంముందే జాగ్రత్త పడతాను. నేను లేకుండా నా భార్య ఒంటరిగా ఇటువంటి పదిమంది వచ్చిపోయే హోటలులో ఉండడం తటస్థించదు. నేను ఒప్పుకున్నా మా ఆవిడ (అతని మనసులో తన వదినవంటి పూర్వాచారపరాయణురాలు మెరిసింది) అసలు ఇటువంటి స్థలాల్లో బసచేయడానికి ఒప్పుకోదు. ఒకవేళ బలవంతంవల్ల ఒప్పుకొన్నా లేక పోయినా తాను ఒంటరిగా ఉండడానికి అంగీకరించదు."

"అదృష్టవంతులు. ఉభయులూ ఒకే రకం దృక్పథాలు కలిగి ఉండడం ఎంతో విశేషమే. సరేకాని, మీరు నా ప్రశ్నకి మాత్రం పూర్తిగా సమాధానం చెప్పేరుకారు. మీ నిజమైన ఆవిడతో నా ప్రశ్న కేమీ సంబంధం లేదు. ఊహించి చెప్పండి; అటువంటి పరిస్థితిలో ఏమి చేసేవారు; ఏమనుకొనేవారు?"

"అదా? నా భార్యను లోకులకంటె బాగానే తెలిసినా, లోకుల మాటలబలంవల్ల కొంత విసుగుదల కలగకపోదు; ఎందుకిటువంటి మాటలనుకొనే అవకాశం ఇవ్వాలీ అని. అంతే కాదు, ఊహాలోని ఆ భార్య ఎటువంటిదో? ఆమె అంటే నాకు ఎంత అభిమానం ఉందో, ఎంత అనుమానం ఉంటో అవన్నీ ముందుగా నిర్ణయించుకోందే, ఫలానా పనికి ఫలితంగా నేను ఏమిటి చేసి ఉండేవాణ్ణో అంటే ఏమిటి చెప్పగలను?"

"ఏమయినా అసలు మీకు అటువంటి పరిస్థితిని తలచుకోడానికికూడా భయంగా ఉంది. అలా ఉండాలి అనుకూల దాంపత్యం అంటే. పోనీ, మరొక్క సంగతి అడుగుతాను కోపం లేదంటే?"

"కోప మెందుకు? అడగండి?"

"మీ భార్య మరొకరితో కలిసి సినిమాకి వెళ్ళడం అన్నది మీ ఊహకి కూడా సరిగా అందని సంగతి. సరేగాని, మరి మీరు నాతో కలిసి ఈవిధంగా రావడం యథార్థమే కదా! ఈ సంగతి తెలిస్తే ఆవిడ ఏమనుకొంటారు? అని."

"ఏమనుకొంటుంది, ఏమీ అనుకోదు; అసలు నేనే చెప్తాను"

"బాగానే ఉంది. ఆవిడ విషయంలో మీరు ఊహించనయినా లేరు. కాని, మీరుమాత్రం ఇంకొకరితో కలిసి తిరిగి వచ్చేనని చెప్తే, ఆవిడ విని సహించి ఊరుకోవాలా? లేక ఆనందించినట్టు నటించాలి కూడానా? ఏమి న్యాయం?"

"మీ రలాగ తర్కిస్తే నా మాట అసందర్భంగా ఉండవచ్చును గాని, దాంట్లో అనుభవసత్యం మాత్రం లేకపోలేదు. నేను, రేడియోకోసమే కాదు, కచేరీలకని ఎప్పుడయినా తిరుగుతూ ఉంటాను. అటువంటి సందర్భాలలో నాకు దురర్థాలు పుట్టకపోవాలి గాని, పుట్టినా ఆపేది లేదు. నా ప్రవర్తనలో ఇప్పుడుగాని, వెనుక పెళ్ళికాని రోజుల్లో గాని, ఏపైనా లోటుపాట్లు ఉన్న సంగతి ఎంత స్పష్టంగా తెలిసినా ఆవిడ నన్ను విడిచిపెట్టలేదు. ఇక, వివాహిత జీవితంలోనే కాదు, అంతకుముందు ఎప్పుడయినాసరే, భార్య ప్రవర్తనలో ఏ కొంచెమో శంకించదగిన అంశం ఉన్నదంటే చాలును విడిచిపెట్టే భర్తలు చాలామంది ఉన్నారు. అందుచేత నా విషయమై ఆవిడ సాధ్యమయినంతవరకూ ఎటువంటి అనుమానాలు పెట్టుకోకుండా ఉండడానికే ప్రయత్నిస్తుంది. అందులోనూ ముఖ్యంగా మా సంగీత పాఠకుల వృత్తిలో, ప్రైవేటుట్యూషన్లు అన్నవి చెప్పవలసేది ఎక్కువభాగం ఆడపిల్లలే. మరీ చిన్నపిల్లలు కాదుకూడాను. అందుచేత ఆవిధంగా నా గురించి అనుమానం పెట్టుకొంటే, దినం గడవదు."

"అయితే మీరు మీ శిష్యరాండ్రను సినిమాలకు కూడా తీసుకొని వెళ్తారన్నమాట ?"

"ఇప్పటికి మీ దయవల్ల అటువంటి అలవాటు లేదు, అసలు ఈ రావడమయినా పరాయి ఊరుగనక మీతో వచ్చేనుగాని, ఇదే మా ఊళ్ళోఅయితే చాలా తటపటాయించిఉండేవాణ్ణే. ఒక నిశ్చయమయిన ఉద్దేశమో లక్ష్యమో పెట్టుకొని, ఒక సాహసకార్యం చేసినా, పదిమంది తనను అపార్థం చేసుకొన్నందుకు మాటపడినా అర్థం ఉంది; కాని, అనవసరంగా నలుగురూ తన గురించి అనుకొనేలా చేసుకోడం ఉందే, పేరుతెచ్చుకోలేం గనక అపకీర్తయినా తెచ్చుకోలేకపోతే ఎలాగన్నట్టనిపిస్తుంది. అమ్మయ్యా వచ్చేశాం. ఇప్పుడిలా మీతో మాట్లాడుతూ ఉంటే మామూలుగానే ఉందిగాని, సినిమాలో ఉన్నంతసేపూ ఒకటే కునుకుపాట్లు. మధ్యమధ్యను మీ రాడిన మాటలకు కూడా ఏమిటి సమాధానం చెప్పేనో నాకు తెలియదు. ఇక ఈ హోటలువాచరికి ఎంతసేపు మేలుకొలుపులు పాడాలో ?"

"అక్కర్లేదులెండి, పిలవగానే లేస్తాడు. వాడికదొక అలవాటయిపోయింది."

ఏమీ మాట్లాడుకోకుండానే ఎవరి గదుల్లోవారు ప్రవేశించి నిద్రపోయే ప్రయత్నం సాగించారు.

మర్నాడు బాంకుకి సెలవు కావడం మూలాన అతని చెక్కు మారలేదు. ఆ మర్నాడు చెక్కు మారిపోయిందిగాని ప్రయాణం మాత్రం కాలేదు. తరవాత మూడు నాలుగు రోజులు ప్రయాణం ప్రసక్తేరాలేదు. అసలు, వెళ్ళిన మరునాటి రాత్రికే వస్తానన్న భావనారాయణ అప్పటికీ రాలేదు. అతను మరి వచ్చేదేమిటి లెండి అంటుంది శశికళ. కాని, శంకరశాస్త్రి మాత్రం, "ఆఁ ఏమో ఏదో పెద్ద అవాంతరంవల్ల రాలేకపోయుంటాడు గాని, అసలే రాక పోతాడా, ఇటువంటి చోటు వదిలేసి" అంటాడు. ఆమె తనలో తాను నవ్వుకొంటుంది శాస్త్రి అమాయికత్వానికి. నిజమే శాస్త్రి వంటి మనిషి ఎన్నడూ అలా చెయ్యలేడు. ముందు తీసుకొని రావడానికే అనుమానించి ఉండేవాడు. కాని, ఒకమారు వచ్చిన తరవాత మాత్రం, ప్రాణంపోయినా విడిచిపెట్టి ఉండేవాడు కాడు. అటువంటివాడికి భావనారాయణలాటి మనిషి తత్వం ఏం తెలుస్తుంది? తానే భ్రమపడ్డాదికదా, తక్కిన విషయాల్లో ఎటువంటి వాడైనా తన విషయంలో స్థిరంగా ఉంటాడని.

ప్రత్యేకించి ఇద్దరికీ ఒక కార్యక్రమమంటూ లేదు. కలిసే భోజనం, ఫలహారం చేస్తున్నారు. ఉదయం ఒకమారు శంకరశాస్త్రి తిరిగి వస్తాడు. మధ్యాహ్నం భోజనానంతరం కొంతసేపు విశ్రమించడం, తరవాత మూడుగంటలప్రాంతంలో లేచి కాఫీలూ ఫలహారాలు పూర్తిచేసుకొని, కొంతసేపు ఏవో కబుర్లు చెప్పుకోడం, సాయంకాలం వీధిలోకి బయలుదేరడం, ఏదో ఒక సినీమా చూసి రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో చేరుకొని, హోటలు తొమ్మిదికే కట్టేసేవాడు, తమ గదులవద్ద కేరియరులలో పెట్టబడి ఉండేది భోంచేసి పడుక్కునేవారు.

నాలుగవనాడు శంకరశాస్త్రి ఒంటరిగా ఉన్నప్పుడు హోటలు మేనేజరు అడిగాడు. "సార్, మీరు మరి రెండురోజులు ఉంటారా? మొదట్లో రెండురోజులే ఉంటామన్నారు. మరేం లేదు. మీ గది మరెవరికయినా కావాలంటే బుక్ చెయ్యడానికి"

శంకరశాస్త్రికి అతడి ప్రశ్న అంతరార్థం తెలియకపోలేదు. "నేను రెండురోజులే ఉండాలనుకున్నాను. కాని, ఇక్కడికి వచ్చేక మరి కొన్ని పనులు కూడా తగిలేయి. ముఖ్యంగా మా ప్రక్క గదిలో ఉన్నారు వాళ్లు మా వాళ్ళే; అతను భావనారాయణ భూముల శిస్తుల వసూళ్ళకని వెళ్ళేడు. ఒకటి రెండురోజుల్లో రావలసినవాడే. అక్కడ ఏమి తప్పనిసరి పనులు ఉన్నాయోగాని, అవిడను అక్కడి వాళ్ళవాళ్ళతో పడదు. అందుచేత ఇక్కడే ఉంటున్నాది. అతను వచ్చేవరకూ ఇక్కడ తోడుగా ఉండమన్నది నన్ను. అందుచేత నేనింకా మరి కొన్నాళ్లపాటు ఉంటాను. అంటే చెప్పలేను. అతను వస్తే వాళ్లు మద్రాసు వెళ్లిపోతారు. నేను మావూరు వెళ్లిపోతాను. అంతవరకూ ఉంటాము. మీకు కావాలంటే మరికొంత అడ్వాన్సు ఇస్తాను, మా రెండు గదులకీనూ."

"అడ్వాన్సుకి బాధలేదండి; వెళ్ళిపోయేటప్పుడు సెటిల్ చేస్తాను నే నడగడం ఎందుకంటే, మీరు మొదట రెండురోజులే ఉంటామన్నారు. మీరు ఇప్పుడుంటే బాధలేదుగాని, రేపు ఖాళీ చేసేసి, ఈలోపుని నేను, మరెవరయినా కావాలంటే లేదని పంపించేస్తే అనవసరంగా గది ఖాళీగా ఉండిపోతుంది చూడండి."

"నిజమేనండి"... మేడమీదికి వెళ్లి శశికళతో అంతా చెప్పేడు. ఆమె ఎందుకో నవ్వింది; అతనికీ నవ్వు వచ్చింది. అతని నవ్వు చూస్తే ఆమెకు మళ్లా నవ్వు వచ్చింది. ఆ నవ్వుల కొక అంతు కనబడలేదు.

హోటలు మేనేజరు అడిగిన మాటల్లోగాని, తన సమాధానంలోగాని, ఎక్కడా నవ్వు రావలసినమాటలు లేవు. ఆ సంగతి తనకు తెలియదా అంటే తెలుసును. అయినా ఎందుకో ఆమెతోపాటు తానూ నవ్వుతున్నాడు, ఆ నవ్వులో ఉండే ప్రభావం కాబోలు. లేకపోతే తా నెందు కింత అకారణంగా నవ్వుతాడు.

హోటలు మేనేజరుతో నయితే అంత స్పష్టంగా చెప్పగలిగేడు గాని, వాస్తవానికి పరిస్థితి అంత సంతృప్తికరంగా లేదు. ఆ భావనారాయణవచ్చే ఆశ మరిలేదట. ఆ వేళ మొట్టమొదటిమారు సినీమాకి కలిసివెళ్ళిననాటిరాత్రి, అతను తాను తమ ఊరికి వెళ్లి పోయేలోపుని రాకుండా ఉంటే బాగుండు ననుకొన్నాడు. కాని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా అతడు వస్తేనే నయమని పిస్తున్నది. అక్కడితో తన బాధ్యత వదిలిపోతుంది. తాను ఏమీ పూచీలేనట్లుగా వెళ్లిపోతే ఎవరూ ఏమీ అనలేరు. ఆమెతో తన కిదివరకు ఏమీ సంబంధం లేదు; ఇకముందు ఉండబోదు. అటువంటి సందర్భంలో తనకేమీ బాధ్యత లేనట్టే. అయినా ఒక స్త్రీని నిరాధారంగా ఏమయితే కానీ అన్నట్టు, విడిచిపెట్టి వెళ్ళిపోగలడా? ఆమె ఏమిటి చెయ్యదలచుకొన్నదీ నిశ్చయంగా తెలియదు. ఒకప్పుడు తన కేమీ భయమూ బాధా లేనట్టూ, తిరిగి యింటికి వెళ్ళిపోతా నంటుంది; మరొకప్పుడు మాట్లాడితే అసలు ఎక్కడికి వెళ్లిపోతుందో తనకే తెలియనట్టుంటాయి మాటలు; చూడగా చూడగా అన్నిటికీ తెగించి ఆత్మహత్యా ప్రయత్నంలో ఉన్నట్టు కూడా కనిపిస్తుంది. ఇంతటి సౌందర్యవతి, వివేకవతి జీవితం మొగ్గలోనే వాడిపోవడమా? ఎంత చక్కటి గొంతు, నేర్చుకోకపోయినా సినీమా పాటలు చక్కగా పాడుతుంది; కొంచెం సాధకంతో, ఎంతగానయినా అభివృద్ధి కావచ్చును. అందుకే, ఆ భావనారాయణ వచ్చి తీసుకొనిపోతే, తనకు మరి ఏ విచారమూ ఉండదు. అయితే అతగాడి తత్వమేమిటో. ఇంటిలోనుండి లేవదీసుకొని వచ్చి, కొన్నాళ్ళపాటు సరదాగా గడిపి, ఇప్పుడిలా మాయమై పోవడం. మనిషిబుద్ధిని స్వార్థం అన్నది ఇంత దట్టంగా అలుముకో గలదన్నమాట!

అటువంటి మనిషిని ఎలా నమ్ముకొని బయలుదేరగలిగిందో? "మరేమిటి చెయ్యడం, గత్యంతరం లేకపోబట్టే; నాకూ కొంత తెలుసును; అయితే ఇంత త్వరలో ఇలా తయారవుతా వనుకో లేదు;" అంటుంది.

"సరే వాళ్లు ఎటువంటి వాళ్ళయినా, ఏ ఉద్దేశాలతో బయలు దేరినా తన కదంతా అప్రస్తుతం. ప్రస్తుతం వారు వస్తే వాళ్ళిష్టం. భావికార్యక్రమం ఏ విధంగా నిర్ణయించుకొన్నా తనకు బాధ లేదు; లేనప్పుడు ఆమెను తీసుకొనివెళ్ళి, ఆ సవతితల్లి దగ్గరే నయినా విడిచిపెట్టెయ్యాలి; అంతేకాని, ఇక్కడ ఇలా హోటలులలో విడిచిపెట్టి వెళ్ళిపోడం నట్టేటను విడిచిపోవడంతో సమానం కాదూ!"

ఇక్కడి తన బాధ్యతను గురించి ఆలోచించినప్పుడు తాను చేస్తున్న పనిలో ఏమీ పొరపాటు లేదనిపిస్తుంది. కాని, ఖర్చు చూసినప్పుడుమాత్రం చెప్పలేని గాభరా కలుగుతుంది. తన ప్రయాణపు ఖర్చులకని తెచ్చినదే కాదు, చెక్కు మార్చిన అరవై రూపాయిలలోనూ చాలాభాగం కరిగిపోతూంది. ఇంకా హోటలువాడి బిల్లు ఎంతేక వస్తుందో? అతనువస్తే తనకు పూచీలేదుగాని, లేకపోతే వాళ్ళబిల్లుకూడా చెల్లించాలి అంటే తన దగ్గరున్న డబ్బు చాలదు; అక్కడ అన్నయ్యా వదినా ఏమనుకొంటూ ఉంటారో? తాను డబ్బుపట్టుకొని రాగానే అన్నయ్య బయలుదేరాలనుకొంటున్నాడు పెళ్లి సంబంధం నిశ్చయం చేసుకోడానికి. తీరా తను వట్టి చేతు లూపుకొని వెళ్ళితే ఏమనుకొంటారు? అసలు ఇంత డబ్బు ఎలా ఖర్చుపెట్టేవని చెప్పడం. పోయిందని అబద్ధం చెప్పడమా? అంతకంటె యథార్థమే చెప్పేస్తే నమ్ముతారా? వాళ్ళకీ నమ్మాలనే ఉంటుందిగాని, లోపల చిన్న అనుమానం ఉండిపోతుంది, వీడు కేవలం సహాయం చెయ్యడానికే ఖర్చుపెట్టి ఉంటాడా? ఇంకా ఏమో? తా నయినా ఇంకొకళ్ళగురించి ఆవిధంగా అనుమానించి ఉండేవాడే...

ఆమె రావడంతో అతని ఆలోచనకి అంతరాయం కలిగింది. "ఇవాళ మధ్యాహ్నం నిద్రపోకుండా ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు."

"ఆలోచనేం లేదు. నిద్రపట్టకపోయినా, అందుకోసమని ఎందుకు తాపత్రయపడడమని ఇలా కూర్చున్నాను ఏదో చదువుదామని. అప్పుడే ఎండాకాలం వచ్చేసినట్టే ఉంది. చదువూ కాలేదు, నిద్రా కాలేదు. మీరు బాగా నిద్రపోయేరా?"

"నాకు మరి ఉన్న పనేమిటి, పగలూ రాత్రి కూడా నిద్రపోవడమే."

"ప్రస్తుతం నా పనీ అంతేలెండి."

"మీకు ఇంటికి వెళ్ళేక కావలసినంత పనుంది. నాపని ఎప్పుడూ ఇంతే. అయితే ఏమిటి ఎప్పుడు బయలుదేరుతున్నారు? అసలు మీ ముఖం చూస్తే ఇంటిమీద ధ్యాసం పుట్టినట్టుంది."

"అద్దంలో చూసుకొంటే నా ముఖంలో నాకేం కనబడడం లేదు. సరే మీ కేదో దివ్యదృష్టి ఉంది కాబోలు."

"ఉందో లేదో మీరే నిర్ణయించాలి. మీరు ఇంటినిగూర్చి మీ శ్రీమతినిగూర్చీ, మీ అబ్బాయినిగూర్చీ ఆలోచిస్తున్నారా లేదా? ఆవిడ ఈపాటికి ఏంచేస్తూ ఉండిఉంటారు? ఏమో, పాపం మీకయినా ఏం తెలుస్తుంది; మీ రున్నప్పటి కార్యక్రమానికి ఇప్పటికీ ఏమి మార్పు ఉందో? ఏమయినా మేఘసందేశంలో యక్షుడు మేఘుడికి చెప్పిన గుర్తుల్లాగు మీరు ఫలానా ఫలానా రకంగా ఉంటారని ఊహించడం లేదూ! అయితే యక్షిత ఒకర్తె; కొడుకు లేడు. మీకు మాత్రం ఆలోచనలో ఇద్దరూ ఒక్కమారే మెదుల్తూ ఉంటారు కాబోలు. మీ అబ్బాయి పేరు చెప్పారు (శంకరశాస్త్రికి భయం వేసింది ఏ పేరు చెప్పాను చెప్పా అని) కాని, మీ శ్రీమతి పేరు మాత్రం చెప్పారు కారు. మరి ఇవాళ చెప్పితీరవలసిందే. లేకపోతే సాయంత్రం షికారుకీ రాను. రాత్రి సినీమాకీ రాను. అసలు పెళ్ళిలోనయినా చెప్పారా లేదా?"

"వాళ్లు చెయ్యవలసిన బలవంతం ఏదో చెయ్యకపోలేదు గాని, కొసకి చెప్పించలేకపోయేరు."

"సరే మొండిపట్టుదలన్న మాటే. నేనూ చూస్తాను కదా! ఇవాళ చెప్పకపోతే వీల్లేదు. అంతగా నోటితో చెప్పడానికి మొగమాటం అయితే, కాగితంమీద రాయండి, అంతే లేకపోతే అంతవరకూ నేను సత్యాగ్రహం చేస్తాను. భోజనం, కాఫీ ఫలహారమూ అన్నీ ముట్టుకోను"

"మంచి సత్యాగ్రహమే. ఇది పూర్వం పెత్తికోతలవాళ్ళ పద్ధతే. అడిగింది ఇచ్చేవరకూ ఏదో ఒకరకంగా శరీరానికి బాధ కలిగించుకొని, అవతలవాళ్ల్ని భయపెట్టడమన్న మాట!"

"మీకిప్పుడిందులో వచ్చిన మహాకష్టమేమిటి కదా! అయినా మీ రెందుకింత మొగమాటపడో నాకర్థంకాకుండా ఉంది. అయితే మరి చెప్పరన్నమాట!"

"ఎందుకు చెప్పను? అయినా నాచేత చెప్పించాలని మీ కెందు కింత పట్టుదలగా ఉందో నాకర్థంకాకుండా ఉంది. ఒక నాలుగత్తురాలమాట విన్నందువల్ల మీకు కలిగే ఆనందం ఏమిటి?"

"మీకు చెప్పకపోవాలని ఎలా పట్టుదలగా ఉందో, మీచేత చెప్పించాలని నాకూ అలాగే పట్టుదలగా ఉంది. అయితే నాలుగత్తురాల పేరన్నమాట! ఏమిటి చెప్మా; నాదీ నాలుగత్తురాల పేరే. ఏమిటయి ఉంటుంది, జయలక్ష్మి, శశిరేఖ, మనోరమ, రాజ్యలక్ష్మి, ఇందుమతి, భానుమతి, జానకమ్మ, సుందరమ్మ, సరస్వతి..."

"అలాగే అవతల మరికొన్ని పేర్లు చెప్పండి."

"మీ గమ్మత్తు నాకు తెలిసింది. చివరికి నాచేతే చెప్పించి అదే అదే అని తప్పుకొందామనా? అలా వీల్లేదు. మీరు స్వయంగా చెప్పితీరాలి."

అంతసేపూ శంకరశాస్త్రి ఏ పేరు చెప్పడమా అనే ఆలోచిస్తున్నాడు. ఏదో పేరు చెప్పేసి, తరవాత మరిచిపోకూడదు. నాలుగత్తురాల పేరని నిర్ధారణ అయిపోయిందికదా? నాలుగత్తురాల పేర్లలో తన శిష్యురాళ్ళ పేరుయినా ఉన్నాయా? ఆ హేమలత! హేమలత? సన్నగా పొడుగ్గా బంగారపు తీగలాగే. పాపం, అంత పొడవుగా ఉండడమే ఒక అవలక్షణ మయింది పెళ్లికొడుకుల మార్కెట్లో. ఆమె ఎలా ఉంటేనేం, ఇప్పుడు తనకు

తూగవదుతున్నది. ఎక్కడ రాయమంటారు? ఈ పేపరుమీద రాద్దునా?"

"ఊహూ ఈ పుస్తకంమీద రాసి నాకు బహుమతి చెయ్యండి జ్ఞాపక చిహ్నంగా ఉంటుంది"

"మంచిదే, నన్ను మరిచిపోయినా, మీఆవిడ పేరయినా కనిపిస్తూ ఉంటుంది."

రాసిన తరవాత ఇంకా ఈ విషయంలో చాలా ప్రసంగం వస్తుందను కున్నాడు శంకరశాస్త్రి. కాని, వెంటనే "అమ్మయ్య, ఇప్పటికి మీచేత చెప్పింత గలిగాను" అని పుస్తకం పట్టుకొని తన గదిలోనికి వెళ్లిపోయింది శశికళ.

ఆ సాయంత్రం మామూలుగానే షికారుకెళ్ళేరు. రాత్రి శినీమా వాలాయకుకూడా తీర్చుకున్నారు—మర్నాడు ఉదయం అతను వీధిలోనికి వెళ్లిరావడం మామూలుకంటె ఒక గంట ఆలస్యం అయింది. క్రిందను అడిగితే తాను వచ్చేవరకూ భోజనం పంపవద్దని ఆమె చెప్పిందని తెలిసింది. సరే, వెంటనే రెండు భోజనాలూ మీదికి పంపమని చెప్పి, వస్తానే అడిగాడు. "నాగురించి మీరెందుకు కూర్చోవడం, నాకు దార్లో మళ్లీ టిఫిను తగిలింది; అందుకో తోడు ఒక తెగని బాతాఖానీ పట్టుకొంది. రోడ్డుమధ్యను నిలబడి గంటల తరబడి అలా ఏదో ఉపన్యాసం చెప్పకు పోవడమే. ఈ మధ్యనల్లా హైదరాబాదులో ఉంటున్న మా స్నేహితులొకడు కనిపించేడు. వాణ్ణి వదుల్చుకుని వచ్చేసరికి ఇంత సేపయింది.

"పోనీకూడా తీసుకు రాలేకపోయేరా? ఇక్కడే భోంచేద్దుకదా! లేక నేనున్నానని తీసుకురావడం మానీసేరా?"

"లేదు—వాణ్ణి పిలవక్కర్లేదు; తనని తను ఆహ్వానించుకుని వచ్చే రకమే. అయితే, ఇప్పుడు వాళ్లత్తవారి ఊరు గుంటూరు వెళ్తున్నాడట—ఒక అయిదు రూపాయలు బదులడిగి వెళ్లిపోయేడు; అందుకు ఉపోద్ఘాతం ఆ ఉపన్యాసం అంతా!"

"ఒక్క అయిదు రూపాయలతో విడిచిపెట్టేసేరు. ఎంతయినా యీ ఆడస్నేహితులకంటె మగస్నేహితులే వెయ్యిరెట్లు నయంకదూ! సమయం తప్పివస్తే, నిర్మొగమాటంగా చెప్పవచ్చును కూడా డబ్బు లేదని. అంతే కాని, అదే ఒక స్త్రీ స్నేహితురాలయితే అంత కలుపుదనం వస్తుందా? అందులోనూ ముఖ్యంగా మీవంటి సహృదయులకు?"

"నిజమే అది నాలోని లోపమే కావచ్చును"

"లోపం మాటకేమిగాని ముందు మీకు కల్లమాలిన కోపం వచ్చింది నామీద ఇలా అన్నందుకు. సరే, నామీద కోపం తరవాత తీర్చుకోవచ్చును గాని ఇందాకా మీకేదో ఉత్తరం వచ్చినట్టుంది"

"ఉత్తరమా? అన్నయ్య రాసిఉంటాడు, కార్డాకవరా?"

"ఏమో నాకేం తెలుసును పోస్టుమేను వచ్చి అడిగితే మీ ప్రక్కగదే అని చెప్పాను. అతను తలుపుసందులోనుండి పడేసి వెళ్లిపోయాడు."

"సరే—"

అతను ఉత్తరం చదివి అలాగే కుర్చీలో కూర్చుండిపోయాడు. ఆమె ఒక అరగంటపైగా చూసి, వచ్చి, "ఏమిటంత తీక్షణంగా ఆలోచిస్తున్నారు? మా అక్కయ్య పెట్టిన మెత్తటి చీవాట్లు చాలా గట్టిగా తగిలేయి కాబోలు; తరవాత ఆలోచిద్దురు గాని లెండి ఎలా శాంతింపజెయ్యడమా అని. నేనూ నాచేతనయిన సహాయం చేస్తాను లెండి. అక్కడ టేబిలుమీద భోజనం పెట్టేసి వచ్చేను."

ఆమె చెయ్యి పట్టుకొని తీసుకొని వెళ్లలేదుగాని, అంత పనీ చేసింది. అతను ఏమీ మాట్లాడకుండా ఎలాగో భోజనం ముగించేశాడు. వెంటనే చొక్కా తొడుక్కొని బయలుదేరుతూ ఉంటే "ఇంకా చేతితడి అయినా ఆరలేదు; ఇంత ఎండలో ఎక్కడికి వెళ్తారు?" అంది శశికళ...

"అలా బజారుపని కొంచెం ఉంది. పిల్లలకు ఏవో ఆటవస్తువులూ అవీ కొనాలి; మా వదినకి ఒక మంచి చీర తెస్తానన్నాను. అసలు మరిచిపోయేను, ఇంతసేపూ నాలోనే అనుకుని, మీతో చెప్పేసి వనుకున్నాను. ఈ సాయంకాలమే మన ప్రయాణం. మీరు మరేమీ అడ్డు చెప్పడానికి వీల్లేదు. అంతగా అతను వస్తే, ఇక్కడకు వచ్చినవాడు అక్కడకు మీయింటికి రాలేడా? అందుచేత మనం ఈ సాయంత్రం బయలుదేరిపోతే, ఎల్లుండి రాజమండ్రీలో మీయింటిదగ్గర దిగబెట్టి, నేను, రేపుదయం మాఊరు వెళ్లిపోతాను. ఏమంటారు?"

"ఏమంటాను, మీరంత నిశ్చయంగా మాట్లాడుతున్నప్పుడు, సరే, మీయిష్టమే. కాని, మీరు తొందరగా బయలుదేరుతున్నట్లున్నారు. నావల్ల ఒకపూట మాత్రం ఎందుకు ఆలస్యంకావడం? అంతే కాక, మాయింటికి మీరు రావడం ఎందుకు; నేను ఎవరితో బయలుదేరేనో అందరికీ తెలుసును; నాతోపాటు మీకుకూడా అపకీర్తి ఎందుకు? ఊహూ మరేమీ అనకండి, పోనీ, నాకోసమే, నన్ను రాజమండ్రీ స్టేషనులో దింపెయ్యండి. అక్కడ బండి చాలాసేపు ఆగుతుంది. మాయిల్లు స్టేషనుకి అట్టే దూరంలేదు. మా వీధిదాకా కూడా బండి కావాలంటే. అంతేకాని, మాయింటికి రావడం ఎందుకు. ఇందుకు ఒప్పుకొంటేనే నా ప్రయాణం."

"అలాగే. మరి నేను బజారుకి వెళ్లాలి;"

"ఇంకా చాలా టైముందికదా: మరోకగంటపోయి వెళ్లకూడదూ?"

"ఇంకా అటువించి వచ్చి హోల్డాలు సర్దుకోవాలి. మరి మీరు అన్నీ సర్దుకుని ఉండండి."

క్రిందకు వెళ్లి హోటలు మేనేజరుతో తామిద్దరూ నాటి సాయంత్రమే వెళ్లిపోతున్నారనీ, బిల్లు అంతా ఎంతయిందో చూడమనీ, సాయంకాలం పాసెంజరుకి వెళ్లడానికి వీలుగా కాస్త భోజనం తయారు చేయించే ఏర్పాటు చేయించమనీ, మెట్లు దిగి రిక్షాలో కూర్చుని, పెద్ద బజారుకి తీసుకొని వెళ్లిపొమ్మని చెప్పి, మళ్లీ జేబులోని ఉత్తరం తీసుకుని చదువుకొన్నాడు. 'చిరంజీవి

తమ్ముడు శంకరశాస్త్రి! అనేక ఆశీర్వచనములు చేసి కామేశ్వర శర్మ వ్రాయునది. నీవు వెళ్లి యిన్ని దినములైనను రాకపోవటాన ఇచ్చట నాకును మీ వదినకును మిక్కిలి ఆందోళనగా నున్నది. నీ శరీరములో ఏమయినా అస్వస్థతగా నున్నచో వెంటనే టెలిగ్రా మియ్యవలెను; మేము ఉభయులమూ వచ్చెదము. అక్కడ నీ వింకను ఉండుట అవసరమయినచో, తక్షణమే టెలిగ్రా మిచ్చుటగాని, లేనిచో నీవు బయలుదేరి వచ్చుటగాని చేయవలెను. నీదగ్గరనుండి ఏవార్తయూ లేకపోవుటవలన మనస్సు పరి పరి విధముల పోవుచున్నది. సాధ్యమయినంత త్వరలో బయలుదేరి రాగోర్తాను. ఇచ్చటకు, నీవు విజయవాడ బయలుదేరిన మరునాడే ఒక పెండ్లి సంబంధమువారు వచ్చినారు. అన్ని విధములా నాకును మీ వదినకును నచ్చినది. నీకును నచ్చగలదనే అనుకొనుచున్నాము. నీవువచ్చి ఇష్టపడినచో ఈ మాఘాంతములోననే వివాహము జరిగించుటకు వారు సిద్ధముగా నున్నారు. ఇంతే సంగతులు గ్రహించవలెను.—

క. కామేశ్వరశర్మ

ఈ ఉత్తరం శశికళ చూసిఉంటే—తనను అబద్ధీకుడను కుంటుంది. అంతకంటె పెద్ద నష్టం ఏమీ లేదుగాని, తాను ఎందుకో తనకే తెలియకుండా ఒక అబద్ధంచెప్పేడు. దానిని మధ్యలో ఎందుకు తెంపివేయాలి. అలాగే కొనసాగిస్తేనే మేలు—ఇంకెంత, మరి కొద్ది గంటలు. అంతే ఆమె ఎవరో తానెవరో? అయినా ఇప్పటిమట్టుకు తన జీవితంలోని ముఖ్యమయిన సమస్య ఆమెకు సంబంధించినదే. ఆమె క్షేమంగా ఇంటికి చేరుకొంటే, తరవాత సంగతికి తాను కర్తకాడు. అధమం తన పరిస్థితుల్లో చేయగలిగిన పని, చేసినట్టే అనుకోవచ్చును—

చేతి ఉంగరం అమ్మగా వచ్చినడబ్బు తనదగ్గర మిగిలిన డబ్బూ కలిపితే హోటలు బిల్లు చెల్లిపోగా ఇంకా సుమారు పాతిక రూపాయిలు మిగిలేయి. ఓ, ప్రయాణానికి మరేం లోటు లేదు; తరవాత సంగతిక అటునించి వరుస్కా రమ్మన్నాడు.

తాను బజారునుండి వచ్చేక సర్దుకోవలసి ఉంటుందను కున్నాడు. కాని, వచ్చేసరికల్లా అన్నీ ప్రయాణానికి సిద్ధంగా అమర్చిఉన్నాయి.

ప్రయాణం చాలా సదుపాయంగానే నడిచింది. శాస్త్రికి మొదట్లో ఉన్నంత తృప్తిగాలేదు. రాజమండ్రి దగ్గరపడుతున్న కొద్దీ రైలు మరికొంత నెమ్మదిగా నడుస్తే బాగుండును ననిపించ సాగింది. ఒకవేళ ఏకారణంవల్లనయినా రయిలు ఆగిపోడం సంభవిస్తే? అతడు విన్న రైలుప్రమాదాల వృత్తాంతాలన్నీ ఒక్కమారు మనసులో మెరిసేయి. అప్పుడేమిటి కావలసి ఉంటుంది. తాను ఆమెను విడిచిపెట్టి వెళ్లిపోగలడా? విడిచిపెట్టక ఏమి ఫలితం? ఎన్నాళ్ళు కలిసిఉన్నా ఇంతే. తానేమో వివాహితుడు; ఆమె ప్రస్తుతానికి ఎవరికీ చెందినది కాకపోయినా తనయెడలమాత్రం ప్రేమ ఉండనుకొందుకి ఏమీ సావకాశం లేదుకదా! అసలు ఉండడానికి వీలేది తాను వివాహితుడుకదా! వివాహితులయినంత మాత్రంలో వాళ్ళ మనస్సు చలించదనీ, వాళ్ళమీద ఇతరులకు మనస్సు కలగరాదనీ ప్రకృతి సహజమయిన నియమం ఏమీ లేదు కదా! అలాగే ఉండేమాటైతే, ప్రపంచంలో ఇన్నిరకాల రహస్య బహిరంగ ప్రణయవ్యవహారాలు సందర్భించడానికి వీ లెలాగుంటుంది?

"ఏమిటి చాలా తీక్షంగా ఆలోచిస్తున్నారు?"

"ఏమీ లేదు, ఇంకెన్ని స్టేషన్లుంది మన సంయుక్తప్రయాణం అని?"

"మీ కంత త్వరగా నా నుండి తప్పించుకోవాలని తహతహగా ఉందన్నమాట?"

"నా కెలా గుంటుందనుకొంటే మీకు తృప్తిగా ఉంటే అలాగే అనుకోండి."

గోదావరి బ్రిడ్జిమీద రయిలు నడుస్తున్నప్పు డామె అంది "ఎన్నోమార్లనుకొనేదాన్ని, ఈ రైలు మీంచి కిందకు దూకేస్తే, అని కాని, అధికంగా పదిమంది దృష్టినీ ఆకర్షించడం నాకు అసహ్యం. లేకపోతే, ఎప్పుడో మూడునాలుగేళ్ళ క్రితమే ఆ పని చేసిఉండేదాన్ని. అసలు మనిషికి దేనికయినా స్వతంత్రం ఉంది గాని చావడానికి మాత్రం లేదు."

తన మామూలు ధోరణిని "ఎందుకులేదు; ప్రతిదినమూ ఎన్నో ఆత్మహత్యలు జరుగుతూనే ఉన్నాయి" అన్నమాట స్ఫురించినా, అందులోని అసందర్భమయిన సూచనను గుర్తించి, "ఆత్మహత్యకు ఉపయోగించేదీ, ఒకమూలకు కూర్చొని విచారించడానికి ఉపయోగించేదీ అదీ స్వాతంత్ర్యమేనా? అనవసరపు ఉద్రేకం లేకుండా, ఇంత వివేకంగా మీరు మాట్లాడడం నాకు ఆనందంగా ఉంది."

ఆమె చేతిరుమాలుతో కట్టబడిన చిన్న పెట్టె ఒకటి అతని చేతిలోఉంచి, "ఇది మీ ఆవిడకు. మీకు ఆవిడదగ్గర ఎలాగూ భయంలేదు కదా. నే నిచ్చేనని చెప్పండి. అసలిది తిన్నగా ఆవిడకుపోస్టులో పంపాలనుకున్నాను. అయినా మీ చేతితో మీరు స్వయంగా ఇవ్వడం మరీ బాగుంటుంది. ఏముంటుందో ఆవిడే స్వయంగా చూసుకోవాలి; అంతవరకు మీరు చూడకూడదు సుమండీ" అంది.

"నాకు మా ఆవిడదగ్గర ఎంత భయం ఉందో పరీక్షిస్తున్నట్టున్నారు?" అంటూ కోటు లోపలిజేబులో పెట్టుకొన్నాడు. చేతిరుమాలుమీద చాలా చక్కని నగిషీపని ఉంది; కమ్మటివాసన కూడా వస్తూంది. ఏ సెంటో, సరిగా పోల్చబడకుండా ఉంది.

ఆమెను జట్కాలో ఎక్కించి తిరిగివచ్చాడు శంకరశాస్త్రి. కొంతసేపటివరకూ చివరి రెండునిమిషాల్లో జరిగిన సంగతులే మనస్సులో మెదలసాగాయి.

"మా వీధివరకూ రారూ?"

"ఎందుకూ, మీమీద నాకు అపనమ్మకం లేదు. నేను అక్కడ రేడియోస్టేషనువాళ్ళతో మరోకమారు కూడా చెప్పేను. తప్పకుండా మీకు ప్రోగ్రామిస్తామన్నారు; అసలు అనేకం చేస్తారులెండి. వస్తేమాత్రం తప్పకుండా వెళ్ళండి."

"ఎందుకు వెళ్లినా, అందులోనూ మిమ్మల్ని ఇంత శ్రమ పెట్టినందుకయినా వెళ్తాను. మీరు తొందరగా బయలుదేరేరు. అక్కడ క్షేమంగా ప్రవేశించాక వీలుచూసుకొని ఒక ఉత్తరం రాస్తారుకదూ, ఎందుచేతంటే మిమ్మల్ని ఇంతవేగంలో మరిచిపోగల ననుకోను" అంటూ ఆమె జట్కా ఎక్క కూర్చుంది.

అతడు మామూలు అలవాటు చొప్పున, 'నమస్కారం సెలవు' అన్నాడు.

ఆమె మొగం తిప్పి, "నమస్కారం" అని మళ్ళీ మొగం అటు తిప్పేసుకొంది. జట్కా వడిచిపోయింది. ఆ మాట మాట లాగ లేకపోడమే కాదు, కళ్ళలో నీళ్లు నిండిఉన్నాయి. అంతే కాదు, తనకు తెలియకుండానే శాస్త్రికళ్ళలోనూ నీళ్లు కమ్మాయి. జట్కా మలుపుతిరిగే సమయంలో తప్ప ఆమె వెనక్కి తిరిగిచూడలేదు. అప్పుడు చూసినా, మరి బాధలేదు, కళ్ళలోని నీళ్లు కనబడనంత ఎడం ఉంది తమ మధ్యను—

రైలు ద్వారపూడి దాటేవరకూ అతని మనస్సు ఒక తిన్నగా ఆలోచించే స్థితికి రాలేకపోయింది. ఆమె ఎదురుగా జట్కాలో కూర్చున్నట్టుగానే, రైలుతోపాటు జట్కా సమాంతరంగా పరుగెడుతున్నట్లుగానే గోచరించ సాగింది.

ప్రక్కనుండి ఎవరో "అగ్గిపెట్టుంటే ఒకసారి ఇప్పిస్తారా?" అనడంతో అతను మామూలు ధోరణిలో పడ్డాడు. లేదంటూనే జేబు తడిమి చూసుకున్నాడు రైలుటిక్కట్టు భద్రంగా ఉందా లేదా అని.

ఆమె యిచ్చిన పెట్టె తగిలింది. తీసి వాసన చూసేడు. ఆమె తన భార్యకిమ్మంది. ఆమె స్వయంగా విప్పి చూడవలసిందేకాని, తాను ముట్టుకోనైనా కూడదట—అనుకొంటూ చేతిరుమాలు నెమ్మదిగా విప్పేడు. ఇదేదో కొత్తరకం సెంటుపెట్టే; కానిది వరకు చూసినదికాదు; అయితే లోపల సీసా లేదు. ఏమిటి చెప్మా ఇది ఉత్తరమా! అరె, తన భార్యకని చెప్పి, తనకే రాసిఉందే.

మిత్రులు శ్రీ శంకరశాస్త్రిగారికి: ఈ ఉత్తరం మీరే చదువుతారని నాకు తెలుసును. మీరేకాక, మీకాబోయే భార్య చదివినా ఇందుకుమూలంగా మీ గురించి చెడుగా ఊహించవలసిన పరిస్థితి కలగదనే నా నమ్మకం.

మీ మాటలనుబట్టి మీరు అవివాహితులని నేను తెలుసుకొన్నాను. అయినా మీరు అవిసంగా చెప్పడంలోని మీ సదుద్దేశాన్ని నేను అర్థంచేసుకోగలిగే ననుకొంటున్నాను.

మీవంటి నిగ్రహమూ, పరోపకారబుద్ధీ కలిగినవారు, అందులో ముఖ్యంగా నావంటి మనిషిని, ముందువెనకలతో నిమిత్తంలేకుండా మీ శక్తి ఉన్నంతవరకూ సాయం చేసినందుకు, మీరు అన్నివిధాలా అభివృద్ధిచెందాలని భగవంతుణ్ణి ప్రార్థించడం కంటె నేనేమీ చెయ్యలేను.

మొట్టమొదట తెలుసుకోలేకపోయినా భావనారాయణ స్వభావం నాకు తరవాత బాగానే తెలిసివచ్చింది. అతడు వెళ్లిపోతున్నాడంటే, మరి తిరిగి రాడనీ, ఏదో నా తంటాలు నేనుపడి ఇల్లుచేరుకొంటానని పూరుకొంటాడనీ తెలుసును. అయితే మా యిల్లూ పరిసరాలు వీటి గురించి మీకు కొంత చెప్పేనుకదూ, ఎక్కువ రాయడం అనవసరం. నేను ఆరోజే ఇంటికి వెళ్ళినా ఈ రోజున వెళ్ళినా పడవలసిన అపనింద ఒకటే. భవిష్యత్తులో ఏ ఆశానక్షత్రమూ కనబడని దైనికయాత్రాక్రమమూ ఒక్కటే. అందువల్లమరొక నాలుగయిదు రోజులు ఉండిశక్తే నేవిటను కున్నాను—అసలు ముఖ్యకారణం మీవంటి మిత్రులు దొరకడం. అయిదారు రోజులే అయినను; అటువంటివి మళ్లీ ఎన్నడయినా వస్తాయా నా జీవితంలో.

నేను ఎక్కువ రాయడం అనవసరం. మీ అన్నయ్యగారి ఉత్తరం తెచ్చి పోస్టుమేన్ నాదగ్గర పడేసేడు. కిందవాళ్లు చెప్పిన గదినంబరు తప్పుగా వినిఉంటాడు. నేను నా ఉత్తరమే మోనని చూసేను. కార్డు వెనకపక్క ఈ మాఘాంతములోనే వారు వివాహము జరిపించుటకు సిద్ధముగానున్నారు అన్న మాట కనబడింది. అసలది కనబడకపోయినా నాకు తెలిసింది మీమాటల ధోరణిబట్టి. మీరు ఎంతసేపూ మీ అన్నయ్య, వదినగారు, పిల్లలు వీళ్ళనుగురించిన మాటలేతప్ప, మీ కుటుంబానికి సంబంధించి వచ్చేవికావు. కాక, నేను వేసే ప్రశ్నలకు మీరు ఆలోచించి ఆలోచించి చెప్పే సమాధానాలు వీటిమూలంగా నాకు అనుమానం లేదు. అయితే మీరాడిన నాటకమే చివరివరకు నేనాడేను.

నేనేమో యిది బహుమతి అని యిస్తున్నానుగాని, నిజంగా నాఖర్చులు నేను భరించుకోడమే; ఈ వారంరోజులు అయినవీ, ఇదివరకు ది హోటలు బిల్లు మీరునన్ను తీర్చనివ్వరు; నాకు తెలుసును. ఈ పెట్టెలో అడుగున (సిల్కుగుడ్డకింద) ఒకనూరు రూపాయిల నోటూ ఒక చిన్న ఉంగరమూ ఉంటాయి. ఆ ఉంగరము మీరు చేసుకోబోయే అమ్మాయి వేలుకి తప్పక సరిపోతుంది; మీ డబ్బు నామూలంగా చాలా ఖర్చయి పోయిందిగనక, ఇది మీకు అవసరం అయితే ఉపయోగిస్తారు. కాని, ఏమాత్రం వీలున్నా ఒక సిల్కు చీర కొనిఇవ్వండి మీ నవవధువుకు—ఈ రెంటి మూలంగానయినా మీవంటి మంచివారు నన్ను జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారంటే నాకదొక తృప్తి. మిమ్మల్ని చెడపకుండా ఇలా విడిచిపెట్టగలుగుతున్నందుకు నన్ను నేను అభినందించుకొంటున్నాను.

నా గురించి మీరు మరేమీ గాభరా పడనక్కరలేదు. ఒకమారు మసూచికం పడిన వ్యక్తికి అందం ఎలాగయితే తిరిగి రాదో అలాగే నేను మరి తెలివితక్కువ సాహస కృత్యాలేవీ చెయ్యనని మీకు హామీ యిస్తున్నాను. ఎటూ దారి చూపలేని సాహస కృత్యాలకంటె, ఎందుకూ పనికిరానిదయినా సామాన్య దిన చర్య మేలని గ్రహించుకొంటున్నాను. ఏమంటే, అందువల్ల వ్యక్తికి ఏ ప్రయోజనం లేకపోయినా, సాంఘికమయిన అపనింద మాత్రం పడనక్కరలేదు—

ఒక్కొక్కప్పుడు ఎందుకో మనస్సు ఎంతో భారంగా ఉంటుంది. పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకపోయినాను. అటువంటప్పుడు కూడా ఎదురుగా ఉన్నవాళ్ళతో చెప్పుకోవాలని

ఉండదు. అందుచేత ఎప్పుడయినా అనుపచ్చ సిరాతో, సంతకం లేకుండా ఉత్తరాలు వస్తే నేను రాసినవే అనుకోండి. నా ఉత్తరాలన్నిటికీ మీరు జవాబు వ్రాయనక్కరలేదు. నామనసులో మాటలు సహృదయులూ సమర్థులూ అయినవారికి చెప్పుకోగలిగేనన్న సంతృప్తి నాకూ చాలును.

ఈ ఉత్తరం రాయడం పూర్తి అయిపోయేక ఇంకా మనం కొన్ని గంటలు కలిసిఉంటాం. అప్పుడే మీదగ్గర శెలవు పుచ్చుకొంటాను.

తోకాకలం:— ఈ రెండూ ఎప్పుడో మా మేనత్త నాకు ఇచ్చినవి. ఇన్నాళ్ళకు వాటిని ఈ విధంగా సార్థకంగా వాడే అవకాశం వచ్చింది.

* * * *

ఉత్తరం చదవడం పూర్తికాగానే అతను అప్రయత్నంగా పెట్టె అనుకున్న వస్తువులు రెండూ తీసి చూసేడు. అవి మళ్ళీ పెట్లో పెట్టి చేతిగుడ్డలు భద్రంగా చుట్టి లోపల జేబులో పెట్టుకొని, వెనక్కి చేరగిలబడి కళ్లు మూసుకొని, ఆలోచించసాగాడు తాను ఏ స్టేషనులో దిగి వెనక్కి వెళ్ళడమా అని. చివరికి ఒకలాగ సమాధానపడ్డాడు ఇక్కడెక్కడ దిగినా వెంటనే బండి ఉండదు. అంతకంటె సామర్లకోటవరకూ ప్రయాణం చేస్తే, తిరుగు రైలు క్షేపంగా ఉంటుంది. అటునుండి బండి రావడానికి కూడా అట్టే వ్యవధి ఉండదు అనుకొన్నాడు. కాని, తీరా అక్కడికి వెళ్ళేక ఇంకోక బుద్ధి పుట్టింది.

ఇంట్లో, మొదట్లో తన ఈ క్రొత్త ప్రస్తావన అన్నయ్యకూ వదినకూ ఏమీ నచ్చలేదు; ఎవరో కనీసం ఆడిపనుకని వచ్చిన మనిషిని తిక్కన సంగతి సందర్భాలేమీ చూసుకోకుండా చేసుకోడమేమిటి? కాని, మరి తాను నిశ్చయించుకొని, ఉన్నాదన్న సంగతి గుర్తించి "సరే, నీ యిష్టమే, ఏదో ఒకటి వేగం కావడమే మా కోరిక" అన్నారు—

"నువ్వు వెళ్లి చూసిరాకూడదా అన్నయ్యా!" అన్నాడు శంకరం.

"ఎందుకురా, నీకు నచ్చిన తరవాత మాకు మరి నచ్చకపోడమేమిటి? అయితే ఈ మాఘంలో నీ ముహూర్తం పెట్టించేస్తే—"

"అదంతా నీ యిష్టం అన్నయ్యా! వాళ్ళెవో పెళ్ళి చేసే స్థితిలో లేరనుకొంటాను. మనింట్లోనే, వీలయినంత నూతృంగా ఒక పండగలాగే జరిపించేస్తే మేలనుకొంటాను. అయితే మరి ముందు నువ్వు వెళ్లి చూడనక్కర్లేదంటావా?"

"నాకేం నీమీద కోపంవచ్చి వెళ్ళనంటున్నా ననుకొంటున్నావేమిటి? నువ్విష్టపడినదే మా యిష్టం. మీ వదినను పెళ్లి ఏర్పాట్లన్నీ చెయ్యమను."

పెళ్ళి యింకా పదిరోజులుందనగా శంకరశాస్త్రికి ఉత్తరం వచ్చింది. అనవాలుగా అనుపచ్చ సిరాతో రాయబడి ఉంది.

మిత్రులు శ్రీ శంకరశాస్త్రిగారికి!

నేను నాకేవో యిబ్బందులు వస్తే మీకు చెప్పుకొందామనుకొంటోంటే మీరే నన్ను చిక్కులలో పెట్టేసేటట్లున్నారు. గోతిలోపడ్డ ఆవును జాలిదలిచి బైటికి తీయదలచినట్టుగానే మీరు నన్ను చేసుకోబోతున్నారేమో ననిపిస్తోంది. నామీద జాలికొద్దీ మీరు మీ జీవితాన్ని పాడుచేసుకోవడం నా కెంతమాత్రం యిష్టం లేదు. మీరు నాకు విజయవాడలో సహాయంచెయ్యడం సంగతి వేరు. ఆ ఘట్టం అక్కడితో సరి. కాని, ఇప్పుడు మీరు వేయబోతున్న అడుగు తరవాత వెనక్కి తీసుకోవాలంటే, మన ఉభయులకూ యిష్టమున్నా చాలా కష్టమౌతుంది. అందుచేత బాగా ఆలోచించండి. అసలు మీ కిటువంటి బుద్ధి ఎలా పుట్టింది? మీరు మనసా నన్ను భార్యగా స్వీకరించగలరా? నావలన సుఖపడగలరని నమ్మకం ఉందా? నానుంచి మీరు కోరుతున్నదేమిటి? ఎదురుగా ఉన్నప్పుడు మీరు వివాహితులైపోయేరు; తరవాత యీనాడు ఉత్తరం రాయకుండా, నా యిష్టం కనుక్కోకుండా, పెద్దవాళ్ళ మధ్యన పెళ్ళిమాటలు నడిపించేరు. గడుసువారే. లిఖితపూర్వకంగా మీదగ్గరనుండి ఈ ఉత్తరానికి తృప్తికరమయిన జవాబు రానిపక్షంలో, నేను నా స్వేచ్ఛను కాపాడుకొందికిగాను తిరిగీ ఇల్లు విడిచిపెట్టవలసిఉంటుంది. నే నింత నిర్మొగమాటంగా రాశానని కోపం తెచ్చుకోక, మీరూ నిదానంగా ఆలోచించి జవాబు రాయండి; ఇప్పటికయినా ఏమీ మించిపోలేదు. మీరు సుఖపడగలనన్న విశ్వాసం ఉంటే తప్ప నన్నే కాదు, ఎవర్నీ చేసుకోవద్దు.

* * * *

ఇద్దరూ పారెగదిలో కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. చివరికి ఆమె అంది. "పోనీ నేను అంతగా రాయమన్నానయినా నాలుగు మాటలు రాస్తే, ఊహు అదీ కష్టమయిపోయింది. కాగితానికి అడ్డంగా చిన్నపిల్లలకి కాపీ పెట్టినట్టు రాసేరు. మీరే తీసుకోండి, మీ వెయ్యిముద్దులకీ ముందు నేను పది చేర్చి పదివేల ముద్దులు చేసేను" అంటూ అతని ఉత్తరం కాగితాన్ని మీద పడేసింది.

"పదివేలే! అయితే ఈ రాత్రి చాలుతుందో చాలదో మరెందు కాలస్యం, ఒకటి రెండు మొదలా" అంటూ కాగితాన్ని ముద్దు పెట్టుకోసాగాడు.

"అయ్యోపాపం, కాగితం ప్రేయసి బుగ్గలు కన్నాలు పడిపోతున్నాయి. అంత మోటుతనమా" అంటూ చేతిలోని కాగితం లాగి క్రిందపడేసి, కుర్చీలో కూర్చున్న అతని తల వెనక్కి వంచి ముద్దుపెట్టుకుంది.